

మేడారం ట్రస్టు బోర్డు లేనట్టేనా?

- ఇప్పటివరకు ప్రకటన ఇవ్వని దేవాదాయ శాఖ
- తాత్కాలిక పునరుద్ధరణ కమిటీకే అధికారుల మొగ్గు
- 2014, 2016, 2020, 2022 నాటి పరిస్థితులే పునరావృతం
- ట్రస్ట్ బోర్డు లేకుంటే రూ.105కోట్ల పనులపై పర్యవేక్షణ లేనట్టే..

వరంగల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడారం మహాజాతర పనులను పర్యవేక్షించే ట్రస్ట్ బోర్డు ఏర్పాటుపై దేవాదాయశాఖ దృష్టి సారించటం లేదు. ఇప్పటికే ప్రభుత్వం మేడారం జాతరలో భక్తులు సౌకర్యాలు కల్పించేందుకు రెండు విడతల్లో రూ.105కోట్లు కేటాయించింది. ఈ నిధులతో జాతరలో చేపట్టే పనులను, ఆదివాసీ గిరిజన సంప్రదాయంలో జాతర జరిగేలా పర్యవేక్షించే ట్రస్టు బోర్డు ఏర్పాటు నియామకంలోనూ తాత్సారం చేస్తోంది. 14మంది సభ్యులతో ఏర్పాటు చేసే కమిటీ కోసం దేవాదాయశాఖ నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంది. కానీ, ఇప్పటివరకు ట్రస్ట్ బోర్డు ఏర్పాటుపై అధికారుల్లో కదలిక లేకపోవటంతో 2014, 2016, 2020,2022 నాటి జాతర ఘటనలే పునరావృతం అవుతాయా అనే చర్చ సాగుతోంది. అయితే స్వయంగా మంత్రి సీతక్క ప్రాతినిత్యం వహిస్తున్న ములుగులోనే మేడారం జాతరకు ట్రస్ట్ బోర్డు ఏర్పాటులో జాప్యంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

మహాజాతరకు ట్రస్ట్ బోర్డు

మేడారం మహా జాతరకు ఆరు నెలల ముందే ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేయటం ఆనవాయితీ. మహాజాతర అభివృద్ధి, ప్రభుత్వం మంజూరు చేసే నిధుల వినియోగం, అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు, జాతర సమయంలో బెల్లం, కొబ్బరికాయలు, భక్తుల క్యూలైన్లు తదితర వాటిని పరిశీలించి.. జాతర సాఫీగా సాగేందుకు ట్రస్ట్ బోర్డు సభ్యులు కృషి చేస్తారు. గతంలో 9మందితో ఉండే ఈ ట్రస్ట్ బోర్డులో సభ్యుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. 2018 మహాజాతరలో ట్రస్ట్ బోర్డు అధ్యక్షుడితోపాటు 14మంది సభ్యులు, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు ఎక్స్ అఫీషియో సభ్యుడిగా నియమించారు. దీంతో కమిటీ సభ్యుల సంఖ్య 15కు చేరింది. ఆ తరువాత 2020, 2022 జాతరలకు ట్రస్ట్ బోర్డుకు బదులుగా పునరుద్ధరణ కమిటీని నియమించారు. ఈ కమిటీలో కూడా 15మందికి చోటు కల్పించారు. అధికార పార్టీ నేతల ప్రతిపాదనలకే దేవాదాయశాఖ ఆమోదం తెలపడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈ ట్రస్ట్ బోర్డు కోసం దేవాదాయశాఖ జాతరకు ఆరు నెలల ముందే నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంది. ఈ నోటిఫికేషన్ వెలువడిన తరువాత 20రోజుల్లో ట్రస్ట్ బోర్డు ప్రకటించాలి. కానీ, ఇప్పటివరకు ట్రస్ట్‌బోర్డు ఏర్పాటులో కదిలిక లేదు. మహాజాతర సమీపిస్తుండటంతో ట్రస్ట్‌బోర్డు ఏర్పాటుపై అధికారులు చొరవ చూపకపోవటం విమర్శలకు దారితీస్తోంది.

ట్రస్ట్ బోర్డు లేకుండానే..

పదేళ్లకాలంలో ఐదు జాతరలు రాగా, వీటిలో నాలుగు జాతరలకు ట్రస్ట్ బోర్డు కమిటీ లేకుండానే నిర్వహించారు. గతంలో అధికారపార్టీ నేతల్లో కమిటీపై ఆధిపత్యం కోసం కొట్లాడి.. కమిటీనే లేకుండానే జాతర నిర్వహించి విమర్శలు ఎదుర్కొన్నారు.

2014లో మహా జాతరకు ట్రస్ట్ బోర్డు కమిటీ ఎంపికలో అప్పటి అధికార కాంగ్రెస్ పార్టీలో విభేదాల ఏర్పడ్డాయి. దీంతో కమిటీ నియామకం జరగలేదు. దీంతో గద్దెల వద్ద సమ్మక్క-సారలమ్మల ప్రసాదం (బెల్లం) పంపిణీలో, తలనీలాల సేకరణ, క్యూలైన్‌ల ఏర్పాటు, కొబ్బరికాయల అమ్మకం, గద్దెల వద్ద బెల్లం తొలగింపు తదితర అంశాల్లో ఇబ్బందులు ఎదురయ్యాయి. 2016లో అయితే బీఆర్ఎస్ పార్టీలో నెలకొన్న విభేదాల వల్ల ట్రస్ట్ బోర్డును ఏర్పాటు చేయలేదు. మూడు నెలల ముందు జాతర పునరుద్ధరణ పేరుతో ఓ కమిటీ వేసి చేతులు దులుపుకున్నారు. దీంతో జాతర పనులపై పర్యవేక్షణ, భక్తుల సౌకర్యాల కల్పనలో ఇబ్బందులు తలెత్తాయి. అయితే 2018లోమాత్రం కాక లింగయ్య చైర్మన్‌గా ట్రస్ట్ బోర్డును మూడు నెలల ముందే నియమించారు. ఆ తరువాత మళ్లీ అదే కథ పునరావృతం అయింది. 2020, 2022 మహాజాతరలకు రాజకీయాల అడ్డు రావటంతో పునరుద్దరణ కమిటీలతో జాతరను మమ అనిపించారు. ప్రస్తుత మహాజాతరకు కూడా పునరుద్ధరణ కమిటీతో మమ అనిపించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ప్రచారం జరుగుతోంది.

కమిటీ ఏర్పాటయ్యేనా..?

ఈసారి కూడా ట్రస్ట్ బోర్డు నియమించే పరిస్థితులు కనిపించటం లేదనే టాక్ వినిపిస్తోంది. మహాజాతరకు మరో 14రోజుల సమయమే ఉంది. ఈ నేపథ్యంలో కమిటీ నియామకం ఎప్పుడు జరుగుతుందనే చర్చ సాగుతోంది. ఇప్పటివరకు దేవాదాయశాఖ నుంచి ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్ కూడా జారీ చేయలేదు. కమిటీ ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేసి... ఆసక్తి ఉన్న సభ్యుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. అనంతరం 20 రోజుల్లో కమిటి ప్రకటించాల్సి ఉంది. కానీ, మహాజాతరకు 14 రోజుల సమయమే ఉండటం.. దేవాదాయశాఖ నుంచి కమిటీ ఏర్పాటుకు నోటిఫికేషన్ వెలువడకపోవటం పలు అనుమానాలకు దారితీస్తోంది. ఈసారి కూడా 2014, 2016, 2020, 2022 తరహాలోనే మేడారం మహాజాతరకు కమిటీ లేకుండానే అభివృద్ధి కమిటీనో..

మిగతా 7వ పేజీలో..

ఏటా.. అదే తీరు..

- మేడారం భక్తులకు తప్పని పాట్లు
- ప్రతీ జాతరలోనూ అవే సమస్యలు
- మౌలిక వసతులపై చిన్నచూపు

7



సమ్మక్క గుడిలో గద్దెను అలంకరిస్తున్న పూజారుల కుటుంబసభ్యులు

మహా జాతరకు తొలిపూజ

- గుడిమెలిగే పండుగతో గిరిజన కుంభమేళాకు అంకురార్పణ
- మేడారానికి భారీగా తరలొస్తున్న భక్తులు

మేడారం, ఫిబ్రవరి 7: తెలంగాణ గిరిజన కుంభమేళ.. మేడారం మహాజాతరకు అంకురార్పణ జరిగింది. గుండెమెలిగే పండుగతో వడ్డెలు (పూజారులు) తొలిపూజ చేశారు. ఈనెల 21 నుంచి 24 వరకు జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మల జాతరకు ప్రారంభ సూచికగా జరిగే ఈ వేడుకను బుధవారం ఘనంగా నిర్వహించారు. సనాతన ఆచారం ప్రకారంగా తొలి పూజగా భావించే ఈ కార్యక్రమంలో సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల పూజా మందిరాలను శుద్ధి చేసి.. పైకప్పును గుట్టగడ్డితో కప్పారు. దీనినే గుడిమెలిగే పండుగా పేర్కొంటారు. ములుగు జిల్లా తాడ్వాయి మండల పరిధిలోని మేడారంలో సమ్మక్క, కన్నెపల్లిలో సారలమ్మ గుడులు, ఏటూరునాగారం మండలం కొండాయిలో గోవిందరాజులు, మహబూబాబాద్ జిల్లా గంగారం మండలంలోని పూనుగొండ్లలో పగిడిద్దరాజుల గుడుల్లో ఈ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. తలపతుల ఆధ్వర్యంలో వడ్డెలు సంప్రదాయ పూజలు చేసి దీపధూప నైవేద్యాలు సమర్పించారు. దీనికి ముందు వేకువజామున పూజారులు, కుటుంబ సభ్యులు ఇళ్లను శుద్ధి చేశారు. జంపన్నవాగులో పుణ్య స్నానాలు ఆచరించారు. కఠోర ఉపవాసాన్ని పాటించిన వడ్డెలు కాళ్లకు చెప్పులు లేకుండానే గుట్ట గడ్డిని సేకరించి డోలు వాయిద్యాల నడుమ గుడుల వద్దకు చేర్చారు. గుడులపై పాత కప్పును తొలగించి కొత్త గడ్డితో కప్పారు. మహిళలు అటవీ ప్రాంతం నుంచి పుట్ట మట్టిని సేకరించి పూజా మందిరాల్లో ఉన్న తల్లి గద్దెను అలికి ముగ్గులతో అలంకరించారు. మహాజాతరకు తొలిపూజగా ఈ కార్యక్రమాలు జరగ్గా ఈనెల 14న (బుధవారం) మండమెలిగే పండగ జరగనుంది. ఆ రోజు మేడారానికి నలువైపులా ద్వారబంధనాలు, రక్షా తోరణాలు కట్టి మహాజాతర నిర్విఘ్నంగా జరగాలని, వనదేవతల దర్శనానికి వచ్చిన భక్తులు క్షేమంగా గమ్యస్థానాలు చేరాలని వడ్డెలు వేడుకుంటారు. ఇక జాతరకు సమయం సమీపిస్తున్న నేపథ్యంలో మేడారం వనదేవతలు సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తులు బుధవారం భారీ సంఖ్యలో తరలొచ్చారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి.. కల్యాణకట్టల వద్ద తలనీలాలు సమర్పించారు. వనదేవతలకు ఎత్తు బంగారం (బెల్లం), పూలు, పండ్లు, చీర, సారె, కొబ్బరికాయలు, పసుపు, కుంకుమ సమర్పించారు. బుధవారం సుమారు 2లక్షల మంది తల్లులను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. ఈ క్రమంలో మేడారం పరిసరాలు భక్తజనంతో కిటకిటలాడాయి.





సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ప్రావీణ్య

'గిరివికాసం' అమలుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ ప్రావీణ్య.. అధికారులతో సమీక్ష

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 7 : జిల్లాలో గిరివికాసం పథకం అమలుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ గిరివికాసం పథకాన్ని గిరిజన రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సాగునీటి వసతి లేని 5 ఎకరాలు కలిగిన గిరిజన రైతులకు ప్రభుత్వం బోరు బావులు, విద్యుత్ మోటార్లను మంజూరి చేస్తుందని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో ఈ పథకం ద్వారా 85 మంది రైతులకు బోరు బావులు, విద్యుత్ మోటార్లు మంజూరి చేయడం జరిగిందన్నారు. గిరిజన ప్రాంతాల రైతులకు అవగాహన కల్పించి ఎక్కువ మంది రైతులు లబ్ధి పొందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. రూ.1కోటి 88 లక్షల నిధులు మంజూరి కాగా, మొత్తం 534 ఎకరాల్లో గిరివికాస పథకం అమలుకు శ్రీకారం చుట్టామన్నారు. 216 మంది లబ్ధిదారులకు రూ.1 కోటి 32 లక్షలు ఖర్చు చేసి రైతుల పొలాలకు బోరు బావులు ఏర్పాటు చేశామన్నారు. ఇంకా మిగిలి ఉన్న రూ.30 లక్షల నిధులతో బోర్లు ఉన్న రైతులకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తూ ప్రయోజనం చేకూర్చడం జరుగుతుందన్నారు. మొక్కలు, స్టంపులు, బండరాళ్లు మొదలైన వాటిని తొలగించడం ద్వారా బంజరు భూములను సాగుగా మార్చాలన్నారు. రైతులకు వ్యవసాయ సాగుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. సమావేశంలో డీఎఫ్‌వో అర్పన, డీఆర్‌డీవో పీడీ సంపత్‌రావు, ట్రాన్స్‌కో ఎస్ఈ మధుసూదన్, గిరిజన శాఖ అధికారి సౌజన్య, ఎఫ్‌ఆర్‌వో రవికిరణ్, గ్రౌండ్ వాటర్ రవి, టెక్నికల్ విభాగం అధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను అభివృద్ధి చేయాలి

- జిల్లా పరిషత్ సీఈవో రాంరెడ్డి

సంగెం, ఫిబ్రవరి 7 : 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాలను అభివృద్ధి చేయాలని జడ్పీ సీఈవో రాంరెడ్డి అన్నారు. సంగెంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కందకట్ల కళావతి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సంఘం నిధులను సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. గ్రామాలకు కేటాయించిన నిధుల వినియోగంపై ప్రభుత్వం దృష్టి పెడుతుందని, గ్రామాల్లో మిగిలిపోయిన పనులను ఈ నిధులతో చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే పనులు ప్రారంభించి అసంపూర్తిగా మిగిలిపోయిన వాటికి కేటాయించుకోవాలని అన్నారు. సమావేశంలో జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బుక్క మల్లయ్య, ఎంపీడీవో రవీందర్, ఎంపీవో కొమురయ్య, పలు గ్రామాల ఎంపీటీసీలు, గ్రామాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

వీగిన అవిశ్వాసం

- వర్ధన్నపేట మునిసిపాలిటీలో హైడ్రామా
- లేఖ ఇచ్చిన తొమ్మిది మందిలో ఆరుగురు కౌన్సిలర్లే హాజరు
- బీఆర్ఎస్ ఖాతాలోనే ఉన్న చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ పదవులు
- కోరం లేకపోవడంతో వీగిపోయిందని ఆర్డీవో వెల్లడి

వర్ధన్నపేట, ఫిబ్రవరి 7 : వర్ధన్నపేట మునిసిపాలిటీ చైర్‌పర్సన్ అంగోతు అరుణ, వైస్ చైర్మన్ కోమాండ్ల ఎలేందర్‌రెడ్డిపై అవిశ్వాసం వీగిపోయింది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఆరుగురు కౌన్సిలర్లు, కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరితో కలిసి అవిశ్వాస తీర్మానానికి నోటీసులు ఇచ్చారు. మంగళవారం నిర్వహించిన అవిశ్వాస తీర్మానానికి తగిన సభ్యులు హాజరు కాకపోవడంతో వీగిపోయినట్లు వరంగల్ ఆర్డీవో వాసుచంద్ర తెలిపారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ జోనాతో కలిసి ప్రత్యేక అధికారి వాసుచంద్ర ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టిన కౌన్సిలర్లు తొమ్మిది మందిలో ఆరుగురు హాజరయ్యారు. దీంతో తగిన కోరం లేకపోవడంతో మధ్యాహ్నం అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రకటించారు.

వర్ధన్నపేట మునిసిపాలిటీలో 12 వార్డులు ఉన్నాయి. ఇందులో 9 వార్డుల్లో బీఆర్ఎస్ కౌన్సిలర్లు, ఇద్దరు కాంగ్రెస్ కౌన్సిలర్లు, ఒక బీజేపీ కౌన్సిలర్ ఉన్నారు. అవిశ్వాస తీర్మానం చేసి నోటీసు అందజేసిన వారిలో బీఆర్ఎస్‌కు చెందిన ఆరుగురు, కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు, ఒక బీజేపీ కౌన్సిలర్ ఉన్నారు. అయితే బుధవారం జరిగిన అవిశ్వాస తీర్మాన సమావేశానికి తొమ్మిది మంది కౌన్సిలర్లలో ఐదుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ కౌన్సిలర్ ఒకరు హాజరు కావడంతో 2/3 మెజారిటీ లేకపోవడంతో అవిశ్వాసం వీగిపోయింది. కాగా, అవిశ్వాసం వీగిపోవడంతో బీఆర్ఎస్‌లో చైర్‌పర్సన్ వర్గీయులు మునిసిపాలిటీ కార్యాలయం ఎదుట టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. బీఆర్ఎస్‌లో



అవిశ్వాసానికి హాజరైన కౌన్సిలర్లు

పోలీసుల భారీ బందోబస్తు

చైర్‌పర్సన్ పదవి ఆశించిన కాంగ్రెస్ కౌన్సిలర్.. తనతో కలిసి రావాలని బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లను కోరారు. అయితే ఇందుకు సంబంధించి లావాదేవీలు జరిగినట్లు ప్రచారం ఉంది. అయితే తీరా తీర్మానం ప్రవేశపెట్టాక ఆ కౌన్సిలర్లు ఇద్దరు మాట తప్పి అవిశ్వాసానికి వ్యతిరేకంగా క్యాంపునకు తరలివెళ్లారు. దీంతో చైర్‌పర్సన్ ఆశిస్తున్న అభ్యర్థి తన భర్తతో కలిసి ఓ కౌన్సిలర్ ఇంటి వద్ద ఆందోళన చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ క్రమంలో గొడవ జరుగుతుందనే ఆలోచనతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ వివాదం పోలీస్‌స్టేషన్‌కు చేరింది. కౌన్సిలర్ ఇంటి ముందు గొడవ జరగడంతో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించడంతో పాటు చుట్టుపక్కల ప్రజలు గుమిగూడకుండా పలు జాగ్రత్తలు తీసుకున్నారు.



నర్సంపేటలో నిర్మిస్తున్న జిల్లా స్థాయి ఆస్పత్రి భవనం

వైద్య విద్యకు సర్వం సిద్ధం

- నర్సంపేటలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు సర్కారు గ్రీన్‌సిగ్నల్
- జిల్లాస్థాయి ఆస్పత్రి భవనంలోనే తాత్కాలిక నిర్వహణ
- ఆగస్టు, సెప్టెంబరులో తరగతులు.. మొదటి సంవత్సరం 50 సీట్లు
- తొమ్మిది ఎకరాల్లో భవన నిర్మాణానికి ఏర్పాట్లు

నర్సంపేట, ఫిబ్రవరి 7 : నర్సంపేటలో పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులోకి రానుంది. వచ్చే 2024-25 విద్యా సంవత్సరంలోనే 50 ఎంబీబీఎస్ సీట్లతో మెడికల్ కళాశాల ప్రారంభం కానుంది. పట్టణంలోని సర్వాపురం గ్రామ శివారులో శరవేగంగా నిర్మాణమవుతున్న ప్రభుత్వ జిల్లా స్థాయి ఆస్పత్రిని మెడికల్ కళాశాల అనుబంధ బోధన ఆస్పత్రిగా మార్చనున్నారు. 250 పడకలతో అప్ గ్రేడ్ చేసిన జిల్లా స్థాయి ఆస్పత్రి భవన నిర్మాణ పనులు ఇప్పటికే 80 శాతం పూర్తయ్యాయి. కళాశాలకు శాశ్వత భవనం నిర్మించడానికి సుమారు రెండేళ్ల వ్యవధి పట్టే అవకాశాలు ఉన్నాయి. అంతవరకు జిల్లాస్థాయి ఆస్పత్రి భవనంలోని కొన్ని గదుల్లో తరగతులు నిర్వహించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

9 ఎకరాల్లో..

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి చొరవతో నర్సంపేటకు వైద్య కళాశాలను మంజూరు చేయించారు. తాజాగా నర్సంపేటలో వైద్య కళాశాల ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వైద్య కళాశాల భవన నిర్మాణం కోసం అవసరమైన సుమారు 9 ఎకరాల స్థలాన్ని సేకరించడానికి రెవెన్యూ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాస్థాయి ఆస్పత్రి సమీపంలోనే స్థలం సేకరించడానికి అధికారులు ముందడుగు వేస్తున్నట్లు తెలిసింది. స్థలం సేకరణ పూర్తయితే నిర్మాణం, మౌలిక సౌకర్యాల కోసం ప్రభుత్వం నిధులను విడుదల చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే జిల్లా స్థాయి ఆస్పత్రి నిర్మాణ పనులను అధికారులతో కలిసి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పరిశీలించారు. నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను కూడా ఆయన ఆదేశించారు. వైద్య కళాశాలకు అవసరమైన స్థలాన్ని గుర్తించాలని రెవెన్యూ అధికారులకు ఆయన సూచించారు. ఇటీవల ఇంజనీరింగ్, రెవెన్యూ, వైద్యశాఖ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య జిల్లా స్థాయి ఆస్పత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తయ్యేలా చూసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఆస్పత్రికి సంబంధించి మూడు బ్లాక్‌లలో ఒక బ్లాక్ పనులను త్వరలో మార్చి నెలాఖరు వరకు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. భవన నిర్మాణ పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. మార్చి నెల చివర లేదా ఏప్రిల్ మొదటి వారం వరకు ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తయితే ఆస్పత్రితో పాటు వైద్య కళాశాలను నిర్వహించే బ్లాక్‌ను ఉన్నతాధికారులు పరిశీలించాక వైద్య కళాశాల నిర్వాహణకు అనుమతి లభించనుంది. అనుమతి లభించిన వెంటనే నోటిఫికేషన్ ద్వారా అడ్మిషన్ పరీక్షలు నిర్వహించి

మిగతా 8వ పేజీలో..

భారీగా సీఐల బదిలీలు

- కమిషనరేట్ పరిధిలో 29 మంది ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం

8

పారదర్శకంగా ఈవీఎంల తనిఖీ

- పరిశీలించిన కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 7 : ఈవీఎం యంత్రాల మొదటి దశ పరిశీలనను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో జిల్లాలోని వరంగల్ తూర్పు, నర్సంపేట, వర్ధన్నపేట నియోజకవర్గాలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను ఈసీఐఎల్ ఇంజనీర్లతో కలిసి పలు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో బుధవారం పరిశీలించారు. ఈవీఎంలను తనిఖీ చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంబంధిత రిజిస్టర్లలను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతీ ఈవీఎంను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఏ దశలోనూ ఎటువంటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో వాసుచంద్ర, ఎన్నికల పర్యవేక్షకులు విశ్వనారాయణ, తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆర్టీసీ బస్సులో వ్యక్తి మృతి



బస్సులో మృతి చెందిన దామోదర్

సుబేదారి, ఫిబ్రవరి 7: గుండెపోటుతో వరంగల్-2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులోనే వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి హనుమకొండ బస్‌స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఆర్టీసీ అధికారుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం సోమదేవరపల్లి గ్రామానికి చెందిన గడ్డం దామోదర్(50) గీత కార్మికుడు. దామోదర్ ఏటూరునాగారంలో బంధువులకు సంబంధించిన ఓ ఫంక్షన్ ఉంటే బుధవారం ఉదయం వెళ్లాడు. తిరిగి ఏటూరునాగారం నుంచి హనుమకొండ బస్‌స్టేషన్‌కు రావడానికి రాత్రి 7గంటల సమయంలో బస్సు ఎక్కాడు. రాత్రి 10గంటల సమయంలో బస్సు హనుమకొండ బస్‌స్టేషన్‌కు చేరుకుంది. ప్రయాణికులందరూ బస్సు దిగి వెళ్లిపోగా దామోదర్ బస్సులోనే కూర్చుని ఉండడంతో బస్సు కండక్టర్ వెళ్లి పరిశీలించగా దామోదర్ ఎటూ కదలలేని స్థితిలో ఉన్నాడు. వెంటనే ఆర్టీసీ అధికారులు అంబులెన్స్‌కు ఫోన్ చేయగా అంబులెన్స్‌లో ఉన్న డాక్టర్ దామోదర్‌ను పరిశీలించి గుండెపోటుతో మృతి చెందినట్లు తెలిపాడు. విషయం తెలుసుకున్న దామోదర్ భార్య మహాలక్ష్మీ, కుమారుడు, కూతురు అల్లుడు వచ్చి బోరున విలపిస్తూ దామోదర్ మృతదేహాన్ని తీసుకెళ్లారు.

290 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

హసన్‌పర్తి, ఫిబ్రవరి 7: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యంను బుధవారం రాత్రి హసన్‌పర్తి, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. హసన్‌పర్తి ఇన్స్‌పెక్టర్ తుమ్మ గోపి తెలిపిన వివరాల ప్రకారం.. హసన్‌పర్తి, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా బుధవారం రాత్రి ఎర్రగట్టుగుట్ట ప్రాంతంలో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అనుమానం వచ్చిన లారీని తనిఖీ చేయగా అందులో అక్రమంగా తరలిస్తున్న 290 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం బస్తాలు ఉన్నాయి. వెంటనే లారీని అదుపులోకి తీసుకున్నారు. లారీ వెంట ఉన్న చినిగిరి సమ్మయ్య, మౌటం వీరయ్య, మౌటం మధుకర్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద ఉన్న లారి, టూ వీలర్, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుచనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సీఐలు దేవేందర్, రమేశ్, ఎస్సైలు రియాజ్, అశోక్, కానిస్టేబుల్ ప్రకాశ్ సిబ్బంది ఉన్నారు.

టిప్పర్‌ను ఢీకొన్న కారు - ఇద్దరి మృతి

శంకరపట్నం, ఫిబ్రవరి 7: కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు గ్రామంలో కరీంనగర్-వరంగల్ హైవేపై బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. కరీం నగర్ నుంచి హనుమకొండవైపు వెళ్తున్న కారు కొత్తగట్టు శ్రీమత్స్యగిరీంద్రస్వామి ఆలయ సమీపంలో అదుపు తప్పి రోడ్డు పక్కన నిలిపి ఉన్న టిప్పర్‌ను ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న హనుమకొండకు చెందిన తాళ్లపల్లి కొంరమ్మ(68), కరీంనగర్‌కు చెందిన నీర్ల ప్రభాకర్ (58) అక్కడికక్కడే మృతి చెందారు. తాళ్లపల్లి సదానందం, తాళ్లపల్లి గీతలకు తీవ్ర గాయాలయ్యాయి. గీత పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మృతుడు ప్రభాకర్ భార్య సబిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి తెలిపారు. ఆగి ఉన్న టిప్పర్‌కు పార్కింగ్ లైట్లు వేయకపోవడంతోనే ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు.



మేడారంలోని సమ్మక్క-సారలమ్మల గద్దెల ప్రాంగణంలో మొక్కులు సమర్పించుకుంటున్న భక్తులు

రెండు లక్షలకుపైగా తరలొచ్చిన భక్తులు

భక్తులతో కిటకిటలాడిన వనదేవతల సన్నిధి



ఎత్తు బంగారం సమర్పిస్తున్న చిన్నారి



జంపన్నకు దండం పెడుతున్న భక్తురాలు

మేడారం, ఫిబ్రవరి 7 : మేడారం సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తులు బుధవారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. మహాజాతర ఈనెల 21నుంచి నాలుగు రోజుల పాటు జరగనుండగా ముందస్తుగా తల్లులను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణకట్టల వద్ద తలనీలాలు సమర్పించారు. శివసత్తుల పూనకాలు, డోలు వాయిద్యాల నడుమ గద్దెల వద్దకు చేరుకొని వనదేవతలకు ఎత్తుబంగారం (బెల్లం), పూలు, పండ్లు, చీరె, సారె, కొబ్బరికాయలు, పసుపు, కుంకుమలు సమర్పించారు. సుమారు రెండు లక్షల మంది భక్తులు తల్లులను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. దీంతో మేడారం పరిసరాలు కిటకిటలాడాయి.



జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

ఏటా అదే తీరు..

● మేడారంలో భక్తులకు తప్పని పాట్లు ● ప్రతీ జాతరకు అవే సమస్యలు..
● నిర్వహణ పరంగానే ఏర్పాట్లు ● మౌలిక వసతులపై అధికారుల చిన్నచూపు



హనుమకొండ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లకో సారి జరిగే మేడారం సమ్మక్క - సారలమ్మ జాతరలో భక్తులకు పాట్లు తప్పడం లేదు. ప్రతీసారి కోట్లాది రూపాయల వ్యయంతో విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికారులు చెబుతున్నా.. భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. అధికారులు జాతర నిర్వహణపై పెడుతున్న దృష్టి.. వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో మాత్రం పెట్టడం లేదు. దీనితో ఎంత భారీగా ఏర్పాట్లు చేసినా.. జాతర జరిగే ఆ నాలుగు రోజులు భక్తులు జాతర ప్రాంగణంలో ఎదుర్కొనే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ముఖ్యంగా దర్శనం సందర్భంగా తల్లుల గద్దెల వద్ద విపరీతమైన రద్దీలో భక్తులు పడే యాతన నరకాన్ని తలపిస్తుంది. ఒక పక్క పోలీసుల ఆంక్షలు, మరో పక్క క్యూలైన్లో విపరీతమైన ఒత్తిళ్ల మధ్య గద్దెల వద్దకు చేరుకొని అమ్మవార్లను దర్శనం చేసుకోవడం ఎంతో ప్రయాసతో కూడుకొని ఉంటుంది. ఈ పరిస్థితి చక్కదిద్దడంలో అధికారులు విఫలమవుతున్నారు.

సెంటిమెంట్‌తో ఆటలు

మేడారంలో అధికారులు భక్తుల సెంటిమెంట్‌తో ఆటలు ఆడుకోవడం పరిపాటిగా మారింది. గద్దెల వద్ద భక్తుల రద్దీని తగ్గించే పేరుతో ప్రతీ జాతరకు కొత్త ప్రతిపాదనలు తెరమీదికి తీసుకువస్తున్నారు. ఇవి భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉంటున్నాయి. వారి నుంచి తీవ్ర స్థాయిలో వ్యతిరేకత రావడంతో చివరి నిమిషంలో విరమించుకుంటున్నారు. ఈ సారి కూడా అధికారులు ఓ కొత్త ఆలోచన చేశారు. భక్తుల బంగారాన్ని (బెల్లం) కన్వేయన్ బెల్టుద్వారా గద్దెల మీదికి చేర్చడం. కొన్ని రోజుల కిందట రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మేడారం ఏర్పాట్లపై జరిపిన సమీక్షా సమావేశంలో అధికారులు ప్రతిపాదనను ప్రవేశపెట్టారు. ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి జాతరకు వచ్చిన భక్తులు తల్లులకు మొక్కులె చెల్లించుకునే క్రమంలో తమ వెంట తెచ్చుకున్న బంగారాన్ని గద్దెలపై స్వయంగా సమర్పించాలనుకుంటారు. అలా చేయడంలోనే వారు ఎంతో సంతృప్తి చెందుతారు. సాధారణ సమయాల్లో గెద్దల వద్దకు వచ్చి చీరె, సారె పసుపు, కుంకుమ, గాజులతో పాటు బెల్లం (బంగారం) స్వయంగా సమర్పిస్తారు. జాతర సమయంలో అది సాధ్యం కాదు కనుక.. గెద్దలపైకి బెల్లం ముద్దలను విసిరేస్తారు. ఇలా భక్తులు విసిరిన బెల్లంతో వనదేవతల గద్దెలు పూర్తిగా నిండిపోయి నిండుగా కనిపిస్తాయి. ఈ సందర్భంగా బెల్లం ముద్దలు తగిలి భక్తులు గాయపడడం కూడా జరుగుతుంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని భక్తులు గద్దెల వద్ద నేరుగా బంగారం సమర్పించే వీలు లేకుండా బయటి నుంచి గద్దెల వరకు ఒక కన్వేయర్ బెల్టును ఏర్పాటుచేసి దానిపై బంగారాన్ని ఉంచితే అది గెద్దల వద్దకే చేరేలా ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన చేశారు. దీనివల్ల జాతరలో గెద్దలపైనే భక్తులు నేరుగా బంగారాన్ని సమర్పించుకునే భాగ్యాన్ని కోల్పోతారు. ఇది ఒక రకంగా భక్తుల సెంటిమెంట్‌ను దెబ్బతీయడమే. పూజారులు సహజంగానే దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. ఇలాంటి పిచ్చి ఏర్పాట్లు చేయడానికి వీలులేదని తెగేసి చెప్పారు. దీనితో ఈ ప్రతిపాదను వాయిదా వేశారు.

కౌంటర్లు ఏమయ్యాయి?

వనదేవతలకు మొక్కులు సమర్పించుకున్న తర్వాత భక్తులకు బంగారం దొరకడమే గగనమవుతుంది. గద్దెలపై ఉన్న బంగారాన్ని తీసుకోవడానికి వీలు లేకుండా చుట్టూ బారికేడ్లు ఉంటాయి. అయినా వాటిని ఛేదించుకొని వెళ్లి చేతికి అందినంత తీసుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. ఈ క్రమంలో తొక్కిసలాట జరగడం, కొంత మంది భక్తులు గాయపడడం తరుచూ జరుగుతూ ఉంటుంది. గద్దెల వద్ద ఉన్న వలంటీర్లను భక్తులు ఎంత బతిమిలాడినా బంగారాన్ని ఇవ్వడానికి నిరాకరిస్తారు. భక్తులు గద్దెలపై విసిరిన వెండి, బంగారం, నగదును ఏరుకోవడానికి పోటీ పడే వలంటీర్లు వారికి కాసింత బంగారాన్ని ఇవ్వడానికి మాత్రం నిరాకరిస్తారు. దీనితో చాలా మంది భక్తులు అమ్మవార్ల గద్దెల మీది బంగారం దొరక్క నిరాశగా వెనుదిరుగుతారు. తల్లులకు సమర్పించిన బంగారాన్ని పంచిపెట్టే వ్యవస్థ జాతరలో ఇప్పటి వరకు లేదు. ఈ అంశం ప్రతీ సారి అధికారుల సమీక్షా సమావేశంలో చర్చకు వచ్చినా పట్టించుకోవడం లేదు. అయితే గతంలో భక్తులకు బంగారం పంచిపెట్టడానికి ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కానీ ఇది ఇప్పటివరకు ఆచరణలోకి రాలేదు. కోట్లాది రూపాయలు వెచ్చించి జాతరలో ఎన్నో పనులు చేసే అధికారులు బంగారం పంపిణీకి ఏర్పాట్లు ఎందుకు చేయరన్న భక్తులు ప్రశ్నిస్తున్నారు. ప్రసాద కౌంటర్లను ఏర్పాటు చేసినట్లయితే గద్దెల వద్ద బంగారం కోసం భక్తులు ఎగబడే పరిస్థితి తొలగిపోతుంది. రద్దీకూడా తగ్గుతుంది.

క్యూలైన్లలో నరకం

తల్లుల దర్శనానికి క్యూలైన్లలో నిలబడే భక్తులు ప్రతీ సారి నరకాన్ని చవిచూడాల్సి వస్తోంది. చాంతాడంతటి క్యూలో గంటల తరబడి వేచిచూసే భక్తులకు అక్కడ తాగడానికి కనీసం మంచినీరు కూడా దొరకదు. అనేక మెలికలు తిరిగి ఉండే ఈ క్యూలో ఒక్కసారి చిక్కుకుంటే మధ్యలో వెనక్కి తిరిగి రావడం ఏ మాత్రం కుదరదు. గద్దెల వద్దకు చేరుకునే వరకు వేచి ఉండాల్సిందే. మధ్యలో బయటకు వచ్చేందుకు దారిలేక భక్తులు అనేక అవస్థలు పడుతుంటారు. తాగడానికి మంచినీరు దొరక్క దప్పికతో గొంతు ఎండిపోయి విలవిలలాడుతూ ఉంటారు. తాగునీటిని అందించేందు క్యూలైన్ల వద్ద ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాల్సి ఉన్నా అధికారులు దానిని పట్టించుకోరు. క్యూ మధ్యలో ఉన్నవారికి బయటి నుంచి తాగునీటిని అందించడం కష్టమే. ఈ దృష్ట్యా క్యూలైన్ల మధ్య పలు చోట్ల తాగునీటి నల్లాలను, లేదా నీటి డ్రమ్ములను గానీ ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

ప్రాథమిక చికిత్స

క్యూలైన్లలో నిల్చున్నవారు అస్వస్థతకు గురైతే తక్షణం వైద్య సదుపాయం అందించే ఏర్పాట్లు కూడా చేయడం లేదు. జాతర ప్రాంగణంలో ప్రత్యేకంగా ఆస్పత్రిని, అక్కడక్కడ ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసినా క్యూలైన్ల మధ్య ఇలాంటి సౌకర్యం కల్పించడం లేదు. క్యూలైన్లలో విపరీతమైన ఒత్తిడి ఉంటుంది. గాలి సరిగా ఆడదు. పైగా ఉక్కపోత. గంటల తరబడి వేచి ఉండడం వల్ల శారీరక అలసట. దీనితో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు. వృద్ధులు, మహిళలు, పిల్లలు అస్వస్థతకు గురికావడం తరుచూ జరుగుతుంటుంది. వారిని పద్మవ్యూహం లాంటి క్యూలైన్ నుంచి బయటకు తీసుకురావడం అంటే.. కురుక్షేత్రంలో యుద్ధం చేసినట్టే. కష్టపడి బయటకు తీసుకువచ్చేలోగా వారి ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణించి మృత్యువాత పడ్డ సంఘటనలు కూడా ఉన్నాయి. అందువల్ల క్యూ మధ్యలోనే అక్కడక్కడ ప్రాథమిక చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

మార్గమధ్యలో దాహం.. దాహం

మేడారం జాతరకు అటవీ గ్రామాల మీదుగా వచ్చే భక్తులు మార్గమధ్యలో తాగునీటి ఇబ్బందులను తప్పడం లేదు. కమలాపూర్ క్రాస్‌రోడ్డు మీదుగా రాంపూర్, చికెనెపల్లి, గొల్లబుద్దారం, దూదేకులపల్లి, బయ్యక్క పేట, మీదుగా నార్లాపూర్ నుంచి మేడారం చేరుకునే భక్తులు తాగునీటి సదుపాయం లేక మార్గ మధ్యలో దాహంతో అల్లాడిపోతుంటారు. పది నుంచి పదిహేను కిలోమీటర్ల దూరం వరకు మార్గ మధ్యలో ఎక్కడా ఆగునీటి వసతిలేక ఇబ్బందులు పడుతుంటారు. ఈ మార్గంలో భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చిపోతుంటారు. చేతిపంపులను ఏర్పాటు చేసినా మరమ్మతులు లేక అవి సరిగా పని చేయవు. జాతర సమీపిస్తున్నందు వల్ల ఈ రహదారిలో తాగునీటి వసతి కల్పించడంతోపాటు తిరుగు ప్రయాణంలో భక్తులు సేద తీరేందుకు వీలుగా తాత్కాలికంగా షెడ్లు వేయాలని భక్తులు కోరుతున్నారు.

ఎత్తుబంగారానికి ఆధార్ తప్పనిసరి

మేడారం జాతరలో ఎత్తు బంగారం సమర్పించుకునే భక్తులకు కొత్తగా ఆధార్ తిప్పలు వచ్చి పడ్డాయి. మేడారం సమక్క-సారలమ్మ జాతరలో ఎక్కువగా భక్తులు చెల్లించే మొక్కు ఎత్తు బంగారాన్ని తల్లులకు సమర్పించుకోవడం. ఇప్పుడు ఈ మొక్కు చెల్లింపునకు ఎక్సైజ్ అధికారులు ఆధార్ లంకె పెట్టారు. ఎత్తు బంగారం కొనేవారు ఆధార్‌కార్డును తప్పని సరి చూపించాల్సిందే. లేదంటే ఎత్తుబంగారం కొనుగోనడానికి వీలు కాదు. బెల్లం అమ్మే దుకాణాల్లో ఎత్తుబంగారం కొనుగోలు చేసే భక్తులు ఆధార్‌కార్డును విధిగా చూపించాలి. ఆ కార్డులోని వివరాలను రాసుకున్న తర్వాతే వ్యాపారులు వారికి ఎత్తు బంగారం తూకం వేస్తారు. గుడుంబా తయారీని అడ్డుకునేందుకే ఈ నిబంధన పెట్టామని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు.

బస్సుల సంఖ్య పెంచాలి

మహాలక్ష్మీ పథకం పుణ్యమా అని ఆర్టీసీ బస్సులో మహిళలు ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు లభించినందువల్ల ఈ సారి మేడారానికి వచ్చే మహిళల సంఖ్య పెరగవచ్చునని భావిస్తున్నారు. ఒక వేళ అదే జరిగితే ఆ మేరకు బస్సుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఏర్పడుతుంది. ప్రతీసారి జాతరకు ఆర్టీసీ మూడు వేల బస్సులను నడుపుతుంది. బస్సుల ద్వారా సుమారు 20 లక్షల మందికిపైగా భక్తులు జాతరకు వస్తుంటారు. ఈ సారి వీరి సంఖ్య 30 లక్షలకు చేరవచ్చునని ఆర్టీసీ అంచనా వేస్తోంది. దీనితో బస్సుల సంఖ్యను మరింత పెంచే విషయమై ఆలోచిస్తోంది. అయితే ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ఉన్నందువల్ల గతంలో జాతరకు రావడానికి పెద్దగా ఆసక్తి చూపని మహిళలు సైతం ఈ ఉచిత వెసులుబాటు విని యోగించుకొని జాతర బాట పట్టవచ్చునని భావిస్తున్నారు. ఈ దృష్ట్యా రద్దీ పెరిగే అవకాశం ఉన్నందు వల్ల మహిళల కోసం ప్రత్యేకంగా మరికొన్ని బస్సులను వేయాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.



జాతరలో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న భక్తులు (ఫైల్)



మేడారం బస్‌స్టేషన్ నుంచి బస్సు దిగి వస్తున్న ప్రయాణికులు

సమన్వయంతో జాతరను విజయవంతం చేద్దాం..

జాతర నిర్వహణకు పటిష్ఠ పోలీసు బందోబస్తు : ములుగు ఎస్పీ డాక్టర్ శబరీష్



సమావేశంలో మాట్లాడుతున్న ములుగు ఎస్పీ డాక్టర్ శబరీష్

దామెర, ఫిబ్రవరి 7: ఆసియా ఖండంలోనే అతి పెద్ద మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరను పోలీసు శాఖ, మీడియా సమన్వయంతో విజయవంతం చేద్దామని ములుగు ఎస్పీ డాక్టర్ శబరీష్ ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం హనుమకొండ జిల్లా దామెర మండలం దుర్గంపేట శివారులోని ఎస్ఎస్ఆర్ హోటల్‌లో పోలీసు శాఖ, మీడియా ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ములుగు ఎస్పీ డాక్టర్ శబరీష్ హాజరై, మేడారం జాతర నిర్వహణపై పలు అంశాలపై చర్చించారు. మహాజాతర సజావుగా సాగేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటే బాగుంటుందనే అంశంపై ఇష్టాగోష్ఠి నిర్వహించారు. ఇందులో భాగంగా గత జాతరలో ఏవైనా ఇబ్బందులు, తలెత్తిన సమస్యలపై ఆయా దినపత్రికలు, మీడియా ఛానళ్ల ప్రతినిధులతో కాసేపు చర్చించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. మేడారం మహా జాతరలో మీడియా ఎంతో కీలక పాత్ర పోషిస్తుందని స్పష్టం చేశారు. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఎక్కడా కూడా ఇబ్బందులు కలుగకుండా పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రతీ నాలుగు కిలోమీటర్ల దూరంలో ఓ పార్కింగ్ సెక్టార్, ప్రతీ సెక్టార్ ఓ డీఎస్పీ స్థాయి అధికారి ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తారని వివరించారు. ప్రత్యేక నిఘా చర్యల్లో భాగంగా సీసీ కెమెరాలు, హెల్ప్ డెస్కులు, డ్రోన్లను వినియోగిస్తూ.. కమాండ్ కంట్రోల్ రూమ్‌ల ద్వారా పర్యవేక్షణ ఉంటుందని పేర్కొన్నారు. అలాగే గత జాతరలో 1200 ఎకరాల పార్కింగ్ స్థలానికి అదనంగా మరో 500ల ఎకరాల పార్కింగ్ స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. పటిష్ఠమైన పోలీసు బందోబస్తు చర్యల్లో భాగంగా 14వేల మంది పోలీసులకు తోడు మరో 500 మంది సీసీఎస్ పోలీసు సిబ్బంది విధులు నిర్వర్తిస్తారని వివరించారు. అలాగే జాతరకు వచ్చే వారు మద్యం సేవించి వాహనాలు నడపొద్దని సూచించారు. పోలీసు శాఖ మార్గదర్శకాలను విధిగా పాటించాలని కోరారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో వన దేవతలను దర్శించుకునేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

కాగా, మేడారం జాతరలో విధి నిర్వహణలో మీడియా ప్రతినిధులు పలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఎస్పీ శబరీష్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందిస్తూ.. మీడియా ప్రతినిధులకు ప్రత్యేక పాసులు కేటాయించడం కోసం ఏర్పాట్లు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో డీపీఆర్‌వో లక్ష్మణ్ రావు, మేడారం జాతర లైజనింగ్ ఆఫీసర్ (దుగ్గొండి సీఐ) పి.కిషన్, స్పెషల్ బ్రాంచి సీఐ కిరణ్‌కుమార్, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ద్వారా నిలువెత్తు బంగారం

మేడారం జాతరలో భక్తులకు వెసులుబాటు

బెల్లం డబ్బులు చెల్లిస్తే తల్లులకు సమర్పణ

పోస్టల్ ద్వారా భక్తులకు ప్రసాదం

హనుమకొండ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మేడారం జాతరలో వనదేవతలకు ఆన్‌లైన్ ద్వారా బంగారం (బెల్లం) సమర్పించే వీలును ప్రభుత్వం కల్పించింది. పోస్టుద్వారా ప్రసాదాన్ని స్వీకరించే అవకాశాన్ని కూడా అందుబాటులోకి తెచ్చింది. ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు జరిగే సమ్మక్క సారలమ్మ జాతరకు లక్షలాదిమంది భక్తులు తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గడ్, ఒరిస్సా జార్ఖండ్ తదితర రాష్ట్రాల నుంచి కూడా తరలివస్తారు. జాతరకు వచ్చే భక్తులు తమ ఎత్తు బంగారం (బెల్లం)తల్లులకు సమర్పించాలని మొక్కుకోవడం ఆనవాయితీ. ఎత్తుబెల్లంతో వనదేవతలకు సందర్శించుకొని మొక్కు చెల్లించుకోవడం వీలుకాని భక్తుల సౌకర్యార్థం దేవాదాయ శాఖ వెసులుబాటు కల్పించింది. వీరి కోసం ఐటీశాఖ సహాయంతో టీ మీసేవా మొబైల్ యాప్ (టీఏపీపీ)ను రూపొందించింది. ఈయాప్ ద్వారా బెల్లాన్ని బుక్‌చేసి దేవతలకు సమర్పించవచ్చు. ఎత్తు బెల్లం ఇవ్వాలనుకునే ఒక వ్యక్తి 50 కిలోల బరువు ఉన్నాడనుకుంటే కిలోకు రూ.60 చొప్పున మొత్తం రూ.3000ను అలాగే మీసేవా చార్జీ కింద రూ.35, పోస్టల్ చార్జీల కింద రూ.100 కలిపి మొత్తం రూ.3,135 చెల్లిస్తే పోస్టల్ కొరియర్ ద్వారా బంగారం భక్తులకు అందుతుంది. మీ సేవా సెంటర్‌కు వెళ్లి మీసేవా-సిటిజన్ వెబ్‌సైట్‌ను తెరిచి లేదా మీ సేవా వెబ్‌సైట్‌లో http://tsmeesevatelangana.gov.inలో లాగిన్ అయి కూడా ఈ సేవలను పొందవచ్చు. లేదా గూగుల్ ప్లే స్టోర్ నుంచి టీఏపీపీ పోలియోను యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని కూడా ఈ సేవలను పొందవచ్చు.

నాణ్యత లేని చలువ పందిళ్లు



గద్దెల వద్ద వెదురు బొంగులతో ఏర్పాటు చేస్తున్న చలువ పందిళ్లు

మేడారం, ఫిబ్రవరి 7: మేడారంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిళ్లల్లో నాణ్యత లోపించిందని తెలుస్తోంది. నాసిరకమైన వెదురు బొంగులతో ఏర్పాటు చేయడంతో ఇవి ప్రమాదకరంగా మారాయని భక్తులు భయాందోళన చెందుతున్నారు. సుబాబుల్, జామాయిల్ కర్రలను ఉపయోగించకుండా అటవీ ప్రాంతంలో ఉచితంగా లభ్యమైన వెదురు బొంగును కాంట్రాక్టర్ వాడటం సరికాదని, ఇవి విరిగిపోయే ప్రమాదం ఉందని భక్తులు అంటున్నారు.

మేడారం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి..

ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి



మేడారం, ఫిబ్రవరి 7: మహాజాతరను నిర్వహిస్తున్న నేపథ్యంలో మేడారం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మేడారంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని ఆమె బుధవారం ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం బుధవారం శ్రీకారం చుట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం ఈనెల 15 వరకు కొనసాగనుంది. ములుగు జిల్లాకు సంబంధించిన కార్యక్రమాన్ని కలెక్టర్ మేడారం నుంచి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేయాలని ఆదేశించారు. అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి చెత్తా చెదారాన్ని, పిచ్చి మొక్కలను తొలగింపజేయాలని అన్నారు. తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా కృషి చేయాలన్నారు. మేడారంలో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని మరింత పకడ్బందీగా చేపట్టాలన్నారు. అలాగే మహాజాతరలో ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజ, డీపీవో వెంకయ్య, డీఎల్‌పీవో స్వరూప రాణి తదితరులు పాల్గొన్నారు.

దొంగలున్నారు.. జర భద్రం



మేడారం, ఫిబ్రవరి 7: మహాజాతరకు ముందే మేడారంలో రద్దీ పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి వనదేవతలను దర్శించుకుంటున్నారు. ఇదే అదనుగా భావించి దొంగలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. దీంతో భక్తులు బెంబేలెత్తిపోతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. 'దొంగలున్నారు జాగ్రత్త' అంటూ భక్తులను అలర్ట్ చేస్తున్నారు. గత జాతరల్లో దొంగతనాలకు పాల్పడిన పోలీసులకు చిక్కిన వారి ఫొటోలతో ఫ్లెక్సీలను రూపొందించి మేడారంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. అలాగే దేవాదాయ శాఖ అధికారులు సైతం దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ మైకుల ద్వారా భక్తులను అప్రమత్తం చేస్తున్నారు.

మేడారం ట్రస్ట్ బోర్డు లేనట్టేనా?

(5వ పేజీ తరువాయి)

పునరుద్ధరణ కమిటీనో నియమించి చేతులు దులుపుకుంటారనే చర్చ సాగుతోంది.

ట్రబులే..

మేడారం మహాజాతర ట్రస్ట్‌బోర్డుకు ఉన్న అధికారాలు పునరుద్ధరణ కమిటీకి ఉండవు. ట్రస్ట్ బోర్డు జాతరకు వచ్చే అభివృద్ధి నిధులపై సమీక్షించే అధికారం ఉంది. పనుల నాణ్యతను పరిశీలించటమే కాకుండా.. కొత్త పనులు చేపట్టేలా సమీక్ష సమావేశంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తుంది. అధికారులు నిర్వహించే ప్రతీ రివ్యూలోనూ అభివృద్ధి, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపైన ప్రశ్నించటం, సలహాలు, సూచనలు ఇస్తుంది. కానీ, పునరుద్ధరణ కమిటీకి ఇవేం లేవు. కేవలం జాతరను ఎలా సక్సెస్ చేయాలో మాత్రం చూస్తుంది. అభివృద్ధి పనులకు ఈ పునరుద్ధరణ కమిటీకి సంబంధం ఉండదని సమాచారం. అధికారులపై ఒత్తిడి తెచ్చి భక్తులకు సౌకర్యాలు కల్పించాలని కోరే పరిస్థితి కూడా లేదని సమాచారం. ఓ రకంగా ఈ పునరుద్ధరణ కమిటీని ఉత్సవ కమిటీగా భావిస్తారని తెలిసింది. దీంతో మహాజాతరలో పాలకమండలి పర్యవేక్షణ లేకపోతే అభివృద్ధి నాణ్యతకు తూట్లు పడే అవకాశం ఉంది. ప్రస్తుతం మేడారం మహాజాతరలో రూ.105కోట్లతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వీటి పర్యవేక్షణపై పునరుద్ధరణ కమిటీకి ఎలాంటి అధికారం లేకపోవటంతో నాణ్యతలోపంతో పాటు ఇతర సమస్యలపై ప్రశ్నించేది ఎవరనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.



ఆంధ్రజ్యోతి WARANGAL CITY

వరంగల్ సిటీ

● వరంగల్ ● ఖిలావరంగల్ ● గీసుగొండ ● సంగెం

గురువారం 8 ఫిబ్రవరి 2024

మహిళా అవార్డుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 7 : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర స్థాయిలో అందించే మహిళా అవార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా జిల్లా సంక్షేమాధికారి ఎం.శారద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాంఘీక, ఆర్థిక సాధికారత రంగాల్లో అసాధారణ పరిస్థితుల్లో విశేష కృషి చేసిన మహిళలు రాష్ట్ర స్థాయిలో అవార్డులకు జిల్లా నుంచి ఆసక్తి, అర్హత కలిగిన వారు ఈ నెల 15వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. tgsrcw@gmail.com మెయిల్‌కు లేదా హైదరాబాద్‌లోని మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనర్‌కు హార్డు కాపీలను సమర్పించాలన్నారు. హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపం పక్కనున్న జిల్లా సంక్షేమాధికారి కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని జిల్లా సంక్షేమాధికారి ఎం.శారద కోరారు.

అనధికార నిర్మాణాల తొలగింపు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 7 : వరంగల్ మహానగర పాలక సంస్థ అధికారులు బుధవారం హనుమకొండలోని గుండ్లసింగారంలో అనధికార నిర్మాణాలను తొలగించారు. ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు ఉన్నట్లు టౌన్ ప్లానింగ్ అధికారులు గుర్తించారు. అక్రమ నిర్మాణాలు జరిపితే కూల్చివేయడంతో పాటు క్రిమినల్ కేసులు పెడతామని సిటీ ప్లానర్ వెంకన్న పేర్కొన్నారు.

బల్దియాలో రెవెన్యూ మేళా



ఫిర్యాదులు స్వీకరిస్తున్న బల్దియా సిబ్బంది

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 7: జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన రెవెన్యూ మేళాలో ప్రజలు వివిధ అంశాలపై ఫిర్యాదులు చేశారు. హనుమకొండలోని బల్దియాప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన మేళాలో ఆస్తి పన్ను, ఇంటి నెంబరు, పేరు మార్పిడి, ఖాళీ స్థలానికి పన్ను మదింపు తదితర అంశాలకు సంబంధించి ప్రజలు ఫిర్యాదులు అందచేశారు. ప్రజలు ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు అదనపు కమిషనర్ అనిసూర్ రషీద్ వెల్లడించారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు అనిల్, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

అమృత్ ప్రతిపాదనలు సిద్ధం చేయండి

▸▸ అధికారులతో మేయర్ సుధారాణి



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 7 : అమృత్ 2.3 పథకం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జీడబ్ల్యూఎంసీ అధికారులను మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. బుధవారం హనుమకొండలోని బల్దియా ప్రధాన కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో ఆమె సమావేశమయ్యారు. తాగునీటి సరఫరా వ్యవస్థ పటిష్టానికి కేంద్రం తొలి దశలో నిధులు కేటాయించనున్న క్రమంలో ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. నీటి ఎద్దడి ప్రాంతాలను పరిగణనలోకి తీసుకొని ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈలు శ్రీనివాసరావు, రాజయ్యతో పాటు పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పంట క్షేత్రాలను పరిశీలించిన డీఏవో



గీసుగొండలో పంట క్షేత్రాన్ని పరిశీలిస్తున్న ఉషాదయాళ్

గీసుగొండ, ఫిబ్రవరి 7 : గీసుగొండ, ధర్మారం గ్రామాల పరిధిలో వివిధ పంటల క్షేత్రాలను జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాళ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేరుశనగ, వరితో పాటు ఇతర పంటలు సాగు చేస్తున్న రైతులు వ్యవసాయ విస్తరణ అధికారులు సూచించే సస్యరక్షణ పద్ధతులను విధిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎస్ఎం కన్సల్టెంట్ సారంగం, ఏఈవోలు కావ్య, అబిద్, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

గీసుగొండ, ఫిబ్రవరి 7: గ్రామాల సమగ్రాభివృద్ధికి కార్యదర్శులు, స్పెషల్ ఆఫీసర్లతో కలిసి ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ఎంపీపీ భీమగాని సౌజన్య అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీపీ చాంబర్‌లో బుధవారం వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలతో ఆమె సమావేశం నిర్వహించారు. 2024-25 సంవత్సరానికి గాను బీపీడీపీ ప్రతిపాదనలను జిల్లా అధికారులకు పంపించనున్నట్లు చెప్పారు. మండలంలోని వివిధ గ్రామాల్లో మండలస్థాయి నిధులు రూ.23లక్షలతో ప్రత్యేక బడ్జెట్‌కు ప్రణాళికలను సిద్ధం చేసినట్లు వివరించారు. సమావేశంలో ఎంపీడీవో వీరేశం, ఎంపీటీసీలు దౌడు కోమల, కాయిత భిక్షపతి, రజిత, వీరారావు, కోఆప్షన్ సభ్యుడు రహీంపాషా, సూపరింటెండెంట్ కమలాకర్, సీనియర్ అసిస్టెంట్ షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి



సమరయోధుల భవనం వద్ద మాట్లాడుతున్న గ్రామస్థులు

గీసుగొండ, ఫిబ్రవరి 7 : మండలంలోని ధర్మారంలో రూ.1.5 కోట్లతో చేపట్టిన పనులు మధ్యలోనే నిలిచిపోయాయని, వాటిని వెంటనే పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2020లో స్వాతంత్ర్య సమరయోధుల భవనం అభివృద్ధి కోసం రూ.50 లక్షలు, మున్నూరుకాపు సంఘం భవన నిర్మాణం కోసం రూ.50 లక్షలు, శ్మశానవాటిక కోసం రూ.50లక్షల అంచనా వ్యయంతో చేపట్టే పనులకు అప్పటి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శంకుస్థాపన చేశారని తెలిపారు. అయితే పనులు మధ్యలోనే ఆగిపోవటంతో ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్థులు చెప్పారు. పనుల పురోగతి, రికార్డు అయిన బిల్లుల వివరాల గురించి సంబంధిత అధికారులను అడిగితే చెప్పకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు మండిపడ్డారు. కాగా, 20 సంవత్సరాల క్రితం కేంద్ర ప్రభుత్వ నిధులతో స్వాతంత్ర్య సమరయోధుల వృద్ధాశ్రమ భవన నిర్మాణ పనులు చేపట్టగా పూర్తి స్థాయిలో కాలేదన్నారు. అసంపూర్తిగా ఉన్న భవనానికి ప్లాస్టరింగ్ తదితర పనులు పూర్తి చేయటానికి 2020లో కుడా జనరల్ ఫండ్ నిధులు రూ.50 లక్షలు కేటాయించారన్నారు. ఇందులో 'కుడా' డివిజన్ కార్యాలయంతో పాటు, మహిళా సంఘానికి ఒక హాల్ ఉండే విధంగా ఏర్పాట్లు చేస్తామని అప్పట్లో అధికారులు చెప్పారన్నారు. అనంతరం అభివృద్ధి పనులను చేపట్టి వదిలేశారని వారు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయా పనులను పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో బొల్లం విద్యాసాగర్, గాదె బాబు, మాజీ సర్పంచ్ గోదాసి సూరయ్య, పోలెబోయిన గణేష్, సదానందం, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, స్వాతంత్ర్య సమరయోధుల భవనం కోసం రూ.50 లక్షల అంచనా విలువతో నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వగా అప్పట్లో రూ.15లక్షల పనులు పూర్తి చేసినట్లు కాంట్రాక్టర్ గోదాసి సూరయ్య తెలిపారు. అయితే తనకు రూ.10 లక్షలు వచ్చాయని, ఇంకా రూ.5 లక్షలు రాలేదన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 7 : ఈ నెల 16న దేశవ్యాప్త కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని, ఇందుకు సంబంధించిన సమ్మె నోటీసును బట్టల వర్తక సంఘం అధ్యక్షుడికి అందజేసినట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి అన్నారు. వివిధ బట్టల షాపులలో పనిచేస్తున్న గుమస్తా, కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదని, ఈఎస్ఐ, పీఎఫ్, గుర్తింపు కార్డులు పనిభద్రత లేక అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్నారని అన్నారు. వారికి నెలకు రూ.26వేలు కనీస వేతనం ఇవ్వాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గుమస్తాల సంఘం నాయకుడు పెండెం కుమారస్వామి, రాజు, రాధిక, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా రమేష్

సంగెం, ఫిబ్రవరి 7 : ఎమ్మార్పీఎస్ సంగెం మండల అధ్యక్షుడిగా మెట్టుపల్లి రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు కేదాసి మోహన్ మాదిగ ఉత్తర్వులు జారీ చేశారు. మండల కేంద్రంలో నాయకుడు మెట్టుపల్లి కొమురయ్య అధ్యక్షతన బుధవారం జరిగిన ఎమ్మార్పీఎస్ మండల స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ దళితుల అభివృద్ధి కోసం పాటుపడాలని సూచించారు. ఈసమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి కొమ్ముల భిక్షపతి, ఎర్రోల్ల సుదర్శన్, వేల్పుల ఆంజనేయులు, మెట్టుపల్లి ప్రవీణ్, నమిండ్ల ఏలియా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నేతలు

రేపు పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన సదస్సు

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 7 : కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై ఈ నెల 9న ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టరేట్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి.ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ముఖ్యోద్దేశం సంప్రదాయ అసంఘటిత రంగంలో స్వహస్తాలతో తయారు చేసిన పరికరాలు లేదా ఉత్పత్తులు చేయువారు తమ తమ వృత్తులలో ఆధునిక ఉపకరణాలు, నైపుణ్యం, వృత్తి కళాకారులు, హస్త కళాకారులను మరింత అభివృద్ధి చేయడం కోసం అవగాహన పెంపొందించడానికి ఈ పథకం ఉపయోగపడుతుందని అన్నారు. సంబంధిత శాఖల అధికారులు, బ్యాంకర్లు పాల్గొననున్న ఈ సదస్సులో కుమ్మరులు, విశ్వబ్రాహ్మణులు, స్వర్ణకారులు, శిల్పులు, కమ్మరులు మొదలైన వృత్తులలో నిమగ్నమై ఉన్న సంప్రదాయ చేతివృత్తుల వారు, హస్త కళాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య కోరారు.

ప్రైవేటు ఆస్పత్రులు నిబంధనలు పాటించాలి

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 7 : రిజిస్ట్రేషన్ల కోసం దరఖాస్తులు చేసుకున్న ప్రైవేటు ఆస్పత్రులు ప్రభుత్వ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో పలు అంశాలపై సూచనలు చేశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటరమణ, ఐఎంఏ అధ్యక్షుడు అన్వర్, ఇతర వైద్యాధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాల దరఖాస్తుల గడువు పొడిగింపు

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 7 : జిల్లాలోని 2023-24 విద్యా సంవత్సరం పోస్టు మెట్రిక్ ఉపకార వేతనాలకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ దివ్యాంగులు అర్హతను బట్టి రెన్యూవల్, ఫ్రెష్ విద్యార్థినీ, విద్యార్థులు తమ వివరాలను ఈ-పాస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి భాగ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గడువును మార్చి 31వ తేదీ వరకు పొడిగించినట్లు చెప్పారు. విద్యార్థుల నుంచి నమోదు చేయించే బాధ్యతను కళాశాలల ప్రధానాచార్యులు, యాజమాన్యాలు తీసుకోవాలన్నారు.

ఫంక్షన్ హాల్ సీజ్

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 7: మడికొండలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌ను జీడబ్ల్యూఎంసీ అధికారులు బుధవారం సీజ్ చేశారు. ఆస్తి పన్నులు చెల్లించని క్రమంలో సీజ్ చేసినట్లు అదనపు కమిషనర్ రవీందర్ తెలిపారు. ఫంక్షన్ హాల్స్ యజమానులు ఆస్తి పన్ను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు.

టెక్స్‌టైల్ పార్కులో స్థానికులకే ఉద్యోగావకాశాలు

▸▸ కలెక్టర్ ప్రావీణ్య



ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి, అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్‌కలెక్టరేట్, ఫిబ్రవరి 7: జిల్లాలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో స్థానిక యువతకు ఉద్యోగావకాశాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి, అధికారులతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. టెక్స్‌టైల్ పార్కులో సంబంధిత కంపెనీలు ఉద్యోగావకాశాల కల్పనలో స్థానిక యువతకే ప్రాధాన్యత ఇవ్వాలని, వారికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి నర్సింహమూర్తి, జోనల్ మేనేజర్ సంతోష్, ఎంప్లాయిమెంట్ అధికారి మాధవి, కార్మిక శాఖ అధికారి రమేష్‌బాబు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు సుభాష్, గణేష్, ఈకో టెక్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో వాటర్ ప్లాంట్ ప్రారంభం

కరీమాబాద్, ఫిబ్రవరి 7: వరంగల్ అండర్ రైల్వేగేటు ప్రాంతంలోని కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సురక్షితమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశ్యంతో విర్బాక్ యానిమల్ హెల్త్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను బుధవారం ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్.మాధవి నేతృత్వంలో 300 లీటర్ల సామర్థ్యం గల ఆర్వో వాటర్ ప్లాంట్‌ను రీజినల్ బిజినెస్ మేనేజర్ మహ్మద్ సిరాజుద్దీన్(సీఎస్ఆర్) కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీలో భాగంగా పాఠశాలకు అందజేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సురక్షితమైన తాగునీటిని అందించాలనే సదుద్దేశ్యంతో వాటర్ ప్లాంట్‌ను అందించడం సంతృప్తికరంగా ఉందన్నారు. ఈ పరికరాన్ని శ్రద్ధగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏబీఎం వి.మహేష్, బీవో రాజ్‌కమల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాఠశాలలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన సిరాజుద్దీన్ తదితరులు

బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం



హెడ్‌పోస్టాఫీసు సెంటర్‌లో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గిర్మాజిపేట, ఫిబ్రవరి 7 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను బుధవారం వరంగల్ హెడ్‌పోస్టాఫీసు సెంటర్‌లో కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ వరంగల్ తూర్పు నాయకుడు నాగరాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు దిష్టిబొమ్మకు బాల్క సుమన్, కేటీఆర్, కేసీఆర్ ఫొటోలు పెట్టి స్థానిక ఎల్‌వీఆర్ నగర్ గుడిసెల కాలనీ నుంచి హెడ్‌పోస్టాఫీసు సెంటర్ వరకు ఊరేగింపుగా వచ్చి దహనం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ నాయకుడు మీసాల ప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతీ పేదవారి ఇంటికి అభివృద్ధి, సంక్షేమ ఫలాలు చేరేలా ఇందిరమ్మ రాజ్యం లక్ష్య సాధనకు అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బాల్క సుమన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం బీఆర్ఎస్ పనితీరుకు అద్దం పడుతోందని విమర్శించారు. పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దోచుకున్నదని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వ అవినీతికి నిదర్శనం కాళేశ్వరం ప్రాజెక్టు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆరు గ్యారంటీలను దశల వారిగా అమలు చేస్తూ మరో వైపు కేసీఆర్ ప్రభుత్వం అవినీతిని ప్రజల ముందు పెడుతుంటే జైలుకెళ్తామనే భయంతో బీఆర్ఎస్ నాయకుడు సుమన్ సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉట్ల ప్రవీణ్, పోలెపాక విశాల్ బాబు, ఎస్.కె.టైమూర్, అన్వేష్, సర్దార్ జస్విర్ సింగ్, నవీన్, శ్రీవిద్య, సరళాదేవి, విజయలక్ష్మి, శ్రీలత, శ్యామల, రబ్బానీ, దుర్గ, పద్మ, చింత కుమార్, వి.శ్రీనివాస్, ఇమాన్యుల్ పాల్గొన్నారు.

వైద్య విద్యకు సర్వం సిద్ధం

(5వ పేజీ తరువాయి)

విద్యార్థుల ఎంపిక పూర్తి చేస్తారు. వచ్చే ఆగస్టు, సెప్టెంబరులో మొదటి సంవత్సరం తరగతులను నిర్వహించే వెసులుబాటు ఉంది.

కోర్సులు, సిబ్బంది..

నర్సంపేట వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు నిర్వహించనున్న సబ్జెక్టుల వివరాలు కింది విధంగా ఉన్నాయి. వైద్య విద్యార్థులకు మొదటి సంవత్సరంలో అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ సబ్జెక్టులతో బోధన జరుగనుంది. అలాగే నర్సంపేటకు మంజూరైన వైద్య కళాశాలలో 59 మంది అధ్యాపకులు(ప్రొఫెసర్లు) మరో 30 మంది ఇతర సిబ్బంది విధులు నిర్వహించనున్నారు.. ఇందులో అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, పాథాలజీ, మైక్రో బయోలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్స్, ఈఎన్‌టీ, అనస్తీషియా, రేడియో డయోగ్నసిస్, అస్పత్రి అడ్మిన్ విభాగాల అధ్యాపకులు విధులు నిర్వహించనున్నారు. కాగా, నర్సంపేట వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా బానోతు కిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నియమించింది. ఆయన బాధ్యతలను స్వీకరించారు.

వైద్య కళాశాలకు అనుమతిపై పెద్ది హర్షం

నర్సంపేటలో వైద్య కళాశాల ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వ డంపై మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభు త్వం 8 మెడికల్ కళాశాలలు మంజూరు చేయగా, అందులో 5 కాలేజీల ఏర్పాటుకు ఆమోదం రావడం.. అందులో నర్సంపేట వైద్య కళాశాల ఉండడం శుభపరిణామమన్నారు. గత ప్రభుత్వం మెడికల్ కళాశాలకు శాశ్వత భవనాలు, ఇతర వసతుల కోసం రూ.193 కోట్లు మంజూరు చేసిందన్నారు. అయితే 100 ఎంబీబీఎస్ అడ్మిషన్లకు గత ప్రభుత్వం అనుమతి ఇవ్వగా, ప్రస్తుత ప్రభుత్వం 50 సీట్లకే అనుమతి ఇవ్వడం సరైంది కాదన్నారు. నర్సంపేటకు వైద్య కళాశాల మంజూరుకు అప్పటి సీఎం కేసీఆర్, మం త్రి హరీష్‌రావు చొరవ మరువలేనిదని ఆయన అన్నారు.

పారిశుధ్య కార్యక్రమాలను విజయవంతం చేయాలి

గీసుగొండ, ఫిబ్రవరి 7 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ఏడు రోజుల పాటు గ్రామాల్లో నిర్వహించే ప్రత్యేక పారిశుధ్య పనుల కార్యక్రమాలను విజయవంతం చేయాలని డీపీవో కల్పన అన్నారు. మండలంలోని బొడ్డుచింతలపల్లిలో చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో బుధవారం ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో చెత్తసేకరణ, ప్లాస్టిక్ వస్తువుల తొలగింపు, వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్, సైడ్ డ్రెయిన్స్‌లో బ్లీచింగ్ చల్లటం వంటి పనులను పారిశుధ్య సిబ్బందితో చేయించాలని గ్రామ ప్రత్యేక అధికారులకు ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీరేశం, తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీవో ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



గీసుగొండలో పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు

దుబాయ్‌లో వైభవంగా విశ్వకల్యాణ మహోత్సవాలు

▸▸ శాంతి కృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో వేడుకలు

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 7 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక, పర్యాటక శాఖ సౌజన్యంతో విరాట్ విశ్వకర్మ అంతర్జాతీయ సాంస్కృతిక విశ్వకల్యాణ మహోత్సవాలను దుబాయ్‌లోని బుర్జు ఖలీఫా వేదికపై నిర్వహించినట్లు గిన్నీస్ వరల్డ్ రికార్డు గ్రహీత, శాంతి కృష్ణ సేవా సమితి వ్యవస్థాపకులు డాక్టర్ శాంతికృష్ణ ఆచార్య తెలిపారు. జనవరి 27 నుంచి ఫిబ్రవరి 27 వరకు ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన భవనం బుర్జు ఖలీఫా వేదికపై శాంతి కల్యాణోత్సవాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ప్రపంచంలోని అన్ని జాతులు, అన్ని మతాల వారు తెలుసుకోవల్సిన విశ్వకర్మ శాంతి సందేశాన్ని వివరించారు. దుబాయ్‌తో పాటు షార్జా, అబుదాబీ నగరాల్లో కూడా నిర్వహించినట్లు తెలిపారు. బుర్జు ఖలీఫా భవనాలకు చెందిన ప్రతినిధులు సయ్యద్ మెహమానొద్దీన్ వారి ఇతర పరివారం ఈ ఉత్సవాలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ స్థాయి విశ్వబ్రాహ్మణ, వేదపండిత పురోహితులు పాల్గొన్నారు.



దుబాయ్‌లో విశ్వశాంతి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

భారీగా సీఐల బదిలీలు

▸▸ కమిషనరేట్ పరిధిలో 29 మంది ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 7: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న 29 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత పెద్దఎత్తున ఇన్‌స్పెక్టర్ల బదిలీ కావడం ఇదే ప్రథమం. ఒకే చోట ఎక్కువ కాలం పని చేయడంతో కొందరిని బదిలీ చేయగా, మరికొందరికి బదిలీ అయిన వారి స్థానాల్లో పోస్టింగ్ ఇచ్చారు. పోస్టింగ్ పొందిన వారు ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో చేరాలని సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశాలు జారీ చేశారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ అయిన ప్రదేశం
పి. మల్లయ్య	పీసీఆర్ వరంగల్	మిల్స్‌కాలనీ
టి. గోపి	హసన్‌పర్తి	మట్టెవాడ
ఎస్. వెంకటేశ్వర్లు	మట్టెవాడ	ఎస్‌బీ వరంగల్
వై. సతీష్	మహబూబాబాద్	హనుమకొండ
ఎస్. కరుణాకర్	హనుమకొండ	టాస్క్‌ఫోర్స్ వరంగల్
ఎన్. చంద్రమోహన్	సీసీఆర్‌బీ	నెక్కొండ సర్కిల్
ఇ. శ్రీనివాస్	మహబూబాబాద్	నర్సంపేట రూరల్
పి. కిషన్	నర్సంపేట రూరల్	ఏనుమాముల
ఎ. మహేందర్	ఏనుమాముల	ఎస్‌బీ వరంగల్
డి. రమణమూర్తి	మల్టీజోన్	నర్సంపేట టౌన్
జె. సురేష్	వీఆర్ వరంగల్	హసన్‌పర్తి
జి. సూర్యప్రకాశ్	భూపాలపల్లి	వర్ధన్నపేట
డి. ప్రతాప్	నిజామాబాద్	మడికొండ
జి. వేణు	మడికొండ	టాస్క్‌ఫోర్స్
ఎం. రవికుమార్	మల్టీజోన్	మామునూరు
వి. క్రాంతికుమార్	మామునూరు	ఎస్‌బీ వరంగల్
ముస్కు రాజు	రామగుండం	స్టేషన్ ఘన్‌పూర్
డి. విశ్వేశ్వర్	పాలకుర్తి	ధర్మసాగర్
కె. శ్రీధర్‌రావు	ధర్మసాగర్	మహిళా పీఎస్-1
ఎల్. రఘు	మల్టీ జోన్	జనగామ
ఇ. శ్రీనివాస్	జనగామ	రఘునాథ్‌పల్లి
ఎ. శ్రీనివాస్‌రెడ్డి	రఘునాథ్‌పల్లి	ఐటీ సెల్ వరంగల్
ఆర్. సంతోష్	ఐటీ సెల్ వరంగల్	ఆత్మకూరు
డి. రవిరాజు	ఆత్మకూరు	వీఆర్ వరంగల్
ఎం. అబ్బయ్య	కేయూ	పరకాల
జి. బాబులాల్	టాస్క్‌ఫోర్స్	గీసుగొండ
కె. శ్రీధర్	ఎస్‌బీ వరంగల్	వరంగల్ ట్రాఫిక్
వి. చేరాలు	సిద్దిపేట	వీఆర్ వరంగల్
జి. మహేందర్‌రెడ్డి	మల్టీజోన్	వీఆర్ వరంగల్

మల్టీ జోన్ ఐజీకి పలువురి అటాచ్

వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో పరిధిలోని మూడు జిల్లాలు వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాలో పనిచేస్తున్న 13 మంది ఇన్‌స్పెక్టర్లను హైదరాబాద్ మల్టీ జోన్-1 ఐజీకి అటాచ్ చేస్తూ సీపీ ఆదేశాలు జారీ చేశారు. పి.వెంకన్న-వరంగల్ ట్రాఫిక్, ఎస్. శ్రీనివాస్-వర్ధన్నపేట, బి.హతిరాం-నెక్కొండ, సార్ల రవి కుమార్-నర్సంపేట, సార్ల రాజు-కాజీపేట, టి.సురేష్-మిల్స్‌కాలనీ, కంప రవీందర్-వీఆర్ వరంగల్, ఎ. శ్రీనివాస్-పర్వతగిరి, కె.రామకృష్ణ-గీసుగొండ, కె.సూర్యప్రసాద్-మహిళా పీఎస్-1, జె.వెంకటరత్నం- పరకాల, సట్ల రాజు-స్టేషన్‌ఘన్‌పూర్, పి.దేవేందర్-వరంగల్ టాస్క్‌ఫోర్స్‌లను హైదరాబాద్‌లో రిపోర్టు చేయాలని సీపీ ఆదేశించారు.

గ్రామాల్లో ప్రభుత్వ పథకాల పరిశీలన

దుగ్గొండి, ఫిబ్రవరి 7 : మండల పరిషత్ కార్యాలయంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో కేంద్ర, రాష్ట్ర అభివృద్ధి పథకాలు, పనులను 16 మంది సెంట్రల్ సెక్రటేరియట్ స్పెషల్ ఆఫీసర్స్ (గ్రూపు-డి అధికారులు) స్టడీ టూర్‌లో భాగంగా బుధవారం సందర్శించి పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు ఎంపీపీ కాట్ల కోమల భద్రయ్య, ఎంపీడీవో కృష్ణప్రసాద్‌లతో పాటు మండల స్థాయి అధికారులు వారికి స్వాగతం పలికారు. మండల అధికారులతో అభివృద్ధి పథకాలపై సమీక్ష నిర్వహించారు. అన్ని రకాల పథకాల అమలు, తీరును తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర పథకాలకు సంబంధించిన వేర్వేరు అధికారుల ద్వారా పథకాలను పూర్తిస్థాయిలో పరిశీలన చేశారు. ఉపాధి హామీ పథకం, ఐసీడీఎస్, పంచాయతీ, వ్యవసాయ, ఆరోగ్య, తదితర వాటిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL గురువారం 8 ఫిబ్రవరి 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

24 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న రేషన్ బియ్యం బస్తాలు

దుగ్గొండి, ఫిబ్రవరి 7: మండలంలోని దేశాయిపల్లి గ్రామంలోని క్రాస్ రోడ్డు వద్ద 24 క్వింటాళ్ల రేషన్ బియ్యం (పీడీఎస్)ను అక్రమంగా తరలించడానికి సిద్ధం గా ఉండగా టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మదన్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ పులి రమేశ్, ఆధ్వర్యంలో బుధవారం తెల్లవారు జామున పట్టుకున్నట్లు ఎస్సై జక్కుల పరమేశ్ వెల్లడించారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ గ్రామానికి చెందిన పర్వతం పేతురు, చింతాల దేవయ్యలు ప్రజల దగ్గర నుంచి అక్రమంగా తక్కువ ధరకు కొనుగోలుచేసి మిల్లులకు తరలించే ప్రయత్నంలో సమాచారం మేరకు దాడులు చేసి పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. బియ్యంతో పాటు స్మార్టుఫోన్, వేహింగ్ మిషన్ (బరువు తుకం చేసే యంత్రం)ను స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు, ఈదాడులలో టాస్క్‌ఫోర్స్ ఎస్సై నర్సింహారావు, పోలీసులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు ప్రారంభం



పారిశుధ్య పనులను చేపడుతున్న అధికారులు

చెన్నారావుపేట, ఫిబ్రవరి 7: మండం లోని ఖాదర్‌పేట, తిమ్మారాయిన్‌పహాడ్, చెన్నారావుపేట, పదహారు చింతల్ తండా, గొల్లపల్లె, ఉప్పరపల్లిలో పాటు పలు గ్రామాలల్లో బుధవారం ప్రత్యేక పాలన అధికారులు పారిశుధ్య పనులను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రోడ్డుపైన చెత్తా చెదారంను ఎక్కడ పడితే అక్కడ వేయరాదన్నారు. మన చుట్టూ ఉన్న పరిసరాలను అపరిశుభ్రం చేయారాదన్నారు. చెత్తాను చెత్తా ట్రాక్టర్‌ల్లో జీపీ సిబ్బంది తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు. ఎంపీడీవో భారతి, ఎంపీవో శ్రీధర్‌రాజు, ఏఈవో శశికాంత్, తదితరులు పాల్గొన్నారు.

• ఖానాపురం : మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో గ్రామంలోని రోడ్లు, డ్రైనేజీలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఖానాపురం పంచాయతీ కార్యదర్శి సుప్రజ, సిబ్బంది రవిబాబు, ప్రసాద్, షబీర్ తదితరులు పాల్గొన్నారు.

• వర్ధన్నపేట రూరల్ : గ్రామాలు పచ్చదనంతో పరిశుభ్రంగా ఉండేలా చూడాల ని వర్ధన్నపేట ఎంపీపీ అన్నమనేని అప్పారావు అన్నారు. బుధవారం మండలంలోని కాషగూడెం గ్రామంలో నిర్వహించిన పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొని పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఈ నెల 7వ తేది నుంచి 15వ తేది వరకు తీసుకున్న పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్‌లో అధికారులు, సిబ్బంది ఉత్సాహంతో పనిచేయాలన్నారు. ప్రజలకు మంచి వాతావరణాన్ని అందించే లా ప్రతీ ఒక్కరు కృషిచేయాలన్నారు. ఇక ఆయా గ్రామాల్లో సైతం పారిశుధ్య పనుల ను గ్రామాల స్పెషల్ ఆఫీసర్లు పర్యవేక్షించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో రాజ్యలక్ష్మి, ఏపీవో నాగేశ్వర్, ఎంపీవో ధనలక్ష్మి, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

• దుగ్గొండి : గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులు బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వం ఈ నెల 7 నుంచి 15 వరకు గ్రామాల్లో పారిశుధ్యం పనులు చేపట్టాలని ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా బుధవారం గ్రామాల్లోని వీదులు శుభ్రపరచడం, రోడ్లపై ఉన్న తుమ్మ చెట్లుతొలగించుట, పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాలలో పరిశుభ్రత, శిథిలావ్యస్థలో ఉన్న భవనాలు తొలగించుట తదితర కార్యక్రమాలు చేపట్టాలని సూచించగా ప్రత్యేక అధికారులు వాటిపై దృష్టిమోపి పనులు చేయించారు. వివిధ గ్రామాల్లో ప్రత్యేక అధికారులు పరిశుభ్రత పనులు చేయించారు. అధికారులు రాంమోహన్, ఏవో దయాకర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల పరిశీలన



మల్లంపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన గ్రూప్ డీ అధికారులు

దుగ్గొండి, ఫిబ్రవరి 7 : మండల పరితషత్ కార్యాలయంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లోని కేంద్ర, రాష్ట్ర అభివృద్ధి పథకాలు, పనులను 16 మంది సెంట్రల్ సెక్రటరియేట్ స్పెషల్ ఆఫీసర్స్ (గ్రూపు డీ అధికారులు) స్టడీ టూర్‌లో భాగంగా బుధవారం సందర్శించి పరిశీలన చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు ఎంపీపీ కాట్ల కోమలభద్రయ్య ఎంపీడీవో కృష్ణప్రసాద్‌లతో పాటు మండలస్థాయి అధికారులు వారికి స్వాగతం పలికారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో అభివృద్ధి పథకాలపై సమీక్ష నిర్వహించారు. అన్ని రకాల పథకాల అమలు, తీరును తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర పథకాలకు సంబంధించిన వేర్వేరు అధికారుల ద్వారా పథకాల పూర్తిస్థాయిలో పరిశీలన చేశారు. ఉపాధి హామీ పథకం, ఐసీడీఎస్, పంచాయతీ, వ్యవసాయ, ఆరోగ్యం. తదితర వాటిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని మల్లంపల్లి హై స్కూల్ సందర్శించి మధ్యాహ్న భోజనం, విద్యార్థులకు అందిస్తున్న తీరును తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు అందించే పౌష్టిక ఆహార పదార్థాలు, సరఫరా తీరును తెలుసుకున్నారు. మండలంలోని వెంకటాపురంలోని పల్లె ప్రగతి, నర్సరీ సందర్శించి పరిశీలన చేశారు. 16 మంది అధికారులతో పాటు డీప్యూటీ సీఈవో సాయితిమిత్ర, ఎంపీడీవో కృష్ణప్రసాద్, ఎంపీవో శ్రీధర్‌గౌడ్, ఏవో దయాకర్, ఏపీవో శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, ఏఈ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనమే పల్లెకు అందం..

• గ్రామాల్లో ప్రారంభమైన పారిశుధ్య పనులు

• 15 వరకు కొనసాగనున్న కార్యక్రమాలు

వర్ధన్నపేట రూరల్, ఫిబ్రవరి 7 : మారుమూల పల్లెలకు పచ్చదనమే అలంకారప్రాయంగా ఉంటుంది. ఈ వాతావరణానికి ఎంతటి వారైనా ముగ్ధులు కావాల్సిందే. ఇందులో భాగంగా ప్రభుత్వం పల్లెల్లో ఉన్న పారిశుధ్యం పై దృష్టి సారించింది. దీని కోసం బుధవారం నుంచి ఈనెల 15వరకు ఆయా గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని నిర్ణయించింది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క ఆదేశాలతో రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. దీనిలో ప్రజలను సైతం భాగస్వాములను చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. సర్పంచుల పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. వీటిలో పంచాయతీ కార్యదర్శులు, కార్మికులు, మిషన్ భగీరథ సిబ్బంది పాల్గొంటున్నారు.

ఎనిమిది రోజుల పాటు కార్యక్రమాలు...

గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించనున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వర్ధన్నపేట మండలంలోని 18 గ్రామాల్లో ఎనిమిది రోజుల పాటు వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు గ్రామాల ప్రత్యేక అధికారులు స్పష్టం చేశారు. మొదటి రోజు పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు గ్రామాల్లో పర్యటించి సమస్యలను గుర్తించారు. ఆయా సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. గ్రామాల్లో పారిశుధ్యంతోపాటు మంచినీటి సరఫరాను మెరుగు పరచటమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందిస్తారు. ఎండాకాలంలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోనున్నారు.



దమ్మన్నపేటలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీవో ధనలక్ష్మి

చేపట్టే పనులు ఇలా...

గ్రామాల్లో రోడ్లు, ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రపరచాలి. ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తారు. మురుగు కాల్వల్లో వ్యర్థపు నీరు నిలవకుండా పూడిక తీయాలి. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేలా అవగాహన కల్పిస్తారు. దోమలువృద్ధి చెందకుండా దోమల మందును స్ప్రేచేస్తారు. శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ భవనాలను తొలగించాలి. ఉపయోగపడని బోరు బావులను మూసేయాలి. గ్రామాల్లో ప్రతీఇంట్లో ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించేలా ప్రజలను చైతన్యం చేయాలి.

ఉత్తమ జీపీల ఎంపిక...

వారంరోజులు నిర్వహించే పారిశుధ్య కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గ్రామ పంచాయతీలకు, కార్మికులను గుర్తించనున్నారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం కార్యక్రమం చివరిరోజు (ఫిబ్రవరి 15న) పంచాయతీ కార్యాలయాల్లో పండగ వాతావరణంలో గ్రామ సభలు నిర్వహించి చేసిన పనులపై అధికారుల సమీక్షించనున్నారు. మద్యపానం, మత్తుపదార్థాలు, గుట్కా వంటి వాటికి యువత దూరంగా ఉండేఉలా వివిధ రూపాల్లో అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోనున్నారు.తదనంతరం పనితీరు ఆధారంగా జిల్లా స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీలను ఎంపిక చేయనున్నారు. ఉత్తమ పని తీరు కనబరిచిన కార్మికులను జిల్లా కలెక్టర్ సన్మానిస్తారని మండల అధికారులు స్పష్టం చేశారు.

టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్‌లో తనిఖీలు

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 7: రాష్ట్ర వ్యాప్త కార్యక్రమంలో భాగంగా విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్ మెంట్ అడిషనల్ ఎస్పీ బాలకోటి ఆధ్వర్యంలో అధికారులు బుధ వారం నర్సంపేట పట్టణంలోని వల్లభ్‌నగర్‌లో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను, వంటశాల పరిసరాలను, పాఠశాలకు సంబం ధించిన రికార్డులు, ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరు రిజిష్టర్లను పరిశీలించారు. తనిఖీలకు సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని అధికారు లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కుమారస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పద్మశ్రీ అవార్డు గ్రహీత సమ్మయ్యకు సత్కారం

వర్ధన్నపేట, ఫిబ్రవరి 7: పద్మశ్రీ అవా ర్డును ఇటీవల పొందిన గడ్డం సమ్మయ్యను దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డీఎన్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షు డు తుమ్మల కుమారస్వామి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఖ్యాతినిచాటిన ఘనత సమ్మయ్యకు దక్కుతుందన్నారు. దళితుల ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిం చాల్సిన అవసరం ఉందన్నారు.

ఘనంగా రామాబాయి అంబేద్కర్ జయంతి

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 7 : నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏబీఎస్ ఎఫ్, ఎంఎస్ఎఫ్, ఏఎస్ యూ ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సతీ మణి రామాబాయి అంబేద్కర్ 124వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. రామాబాయి అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నవీన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, కావ్య, సునీత, రచన, పర్ణిన, అనిత, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

తిరుపతికి వెళ్లిన బుధరావుపేట భజన బృందాలు

ఖానాపురం, ఫిబ్రవరి 7: మండలంలోని బుధరా వుపేట వేంకటేశ్వరస్వామి ఆలయం తర పున ఇదే గ్రామానికి చెందిన రెండు భజన బృందాలు బుధవా రం తిరుమల తిరుపతికి తరలివెళ్లారు. కర్ర పిచ్చిరెడ్డి భజన బృందంలోని 15మంది పగడాల రాంనర్సింహారెడ్డి భజన బృందంలోని 15మంది సభ్యులు బుధ వారం బుధరావుపేట వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తిరుపతికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా పిచ్చిరెడ్డి, రాంనర్సింహారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 9న తిరుమలలో వారికి కేటాయించిన సమయంలో భజన చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మహాలక్ష్మి వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

భారీగా సీఐల బదిలీలు

• కమిషనరేట్ పరిధిలో 29 మంది ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 7: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న 29 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత పెద్దఎత్తున ఇన్‌స్పెక్టర్ల బదిలీ కావడం ఇదే ప్రథమం. ఒకే చోట ఎక్కువ కాలం పని చేయడంతో కొందరిని బదిలీ చేయగా, మరికొందరికి బదిలీ అయిన వారి స్థానాల్లో పోస్టింగ్ ఇచ్చారు. పోస్టింగ్ పొందిన వారు ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో చేరాలని సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశాలు జారీ చేశారు.

బదిలీ అయిన సీఐల వివరాలు

పేరు	ప్రస్తుతం	బదిలీ ఐన ప్రదేశం
పి. మల్లయ్య	పీసీఆర్ వరంగల్	మిల్స్‌కాలనీ
టి. గోపి	హసన్‌పర్తి	మట్టెవాడ
ఎన్. వెంకటేశ్వర్లు	మట్టెవాడ	ఎస్‌బీ వరంగల్
వై. సతీష్	మహబూబాబాద్	హనుమకొండ
ఎన్. కరుణాకర్	హనుమకొండ	టాస్క్‌ఫోర్స్ వరంగల్
ఎన్. చంద్రమోహన్	సీసీఆర్‌బీ	నెక్కొండ సర్కిల్
ఇ. శ్రీనివాస్	మహబూబాబాద్	నర్సంపేట రూరల్
పి. కిషన్	నర్సంపేట రూరల్	ఏనుమాముల
ఎ. మహేందర్	ఏనుమాముల	ఎస్‌బీ వరంగల్
డి. రమణమూర్తి	మల్టీజోన్	నర్సంపేట టౌన్
జె. సురేష్	వీఆర్ వరంగల్	హసన్‌పర్తి
జి. సూర్యప్రకాశ్	భూపాలపల్లి	వర్ధన్నపేట
డి. ప్రతాప్	నిజామాబాద్	మడికొండ
జి. వేణు	మడికొండ	టాస్క్‌ఫోర్స్
ఎం. రవికుమార్	మల్టీజోన్	మామునూరు
వి. క్రాంతికుమార్	మామునూరు	ఎస్‌బీ వరంగల్
ముస్క రాజు	రామగుండం	స్టేషన్ ఘన్‌పూర్
డి. విశ్వేశ్వర్	పాలకుర్తి	ధర్మసాగర్
కె. శ్రీధర్‌రావు	దర్మసాగర్	మహిళా పీఎస్-1
ఎల్. రఘు	మల్టీ జోన్	జనగామ
ఇ. శ్రీనివాస్	జనగామ	రఘునాథ్‌పల్లి
ఎ. శ్రీనివాస్‌రెడ్డి	రఘునాథ్‌పల్లి	ఐటీ సెల్ వరంగల్
ఆర్. సంతోష్	ఐటీ సెల్ వరంగల్	ఆత్మకూరు
డి. రవిరాజు	ఆత్మకూరు	వీఆర్ వరంగల్
ఎం. అబ్బయ్య	కేయూ	పరకాల
జి. బాబులాల్	టాస్క్‌ఫోర్స్	గీసుగొండ
కె. శ్రీధర్	ఎస్‌బీ వరంగల్	వరంగల్ ట్రాఫిక్
వి. చేరాలు	సిద్దిపేట	వీఆర్ వరంగల్
జి. మహేందర్‌రెడ్డి	మల్టీజోన్	వీఆర్ వరంగల్

మల్టీ జోన్ ఐజీకి పలువురి అటాచ్

వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో పరిధిలోని మూడు జిల్లాలు వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాలో పనిచేస్తున్న 13 మంది ఇన్‌స్పెక్టర్లను హైదరాబాద్ మల్టీ జోన్-1 ఐజీకి అటాచ్ చేస్తూ సీపీ ఆదేశాలు జారీ చేశారు. పి.వెంకన్న- వరంగల్ ట్రాఫిక్, ఎస్. శ్రీనివాస్ - వర్ధన్నపేట, బి. హతిరాం- నెక్కొండ, సార్ల రవికుమార్- నర్సంపేట, సార్ల రాజు- కాజీపేట, టి.సురేష్- మిల్స్‌కాలనీ, కంప రవీందర్- వీఆర్ వరంగల్, ఎ. శ్రీనివాస్- పర్వతగిరి, కె.రామకృష్ణ- గీసుగొండ, కె.సూర్యప్రసాద్- మహిళా పీఎస్-1, జె. వెంకటరత్నం- పరకాల, సట్ల రాజు- స్టేషన్‌ఘన్‌పూర్, పి.దేవేందర్- వరంగల్ టాస్క్‌ఫోర్స్‌లను హైదరాబాద్‌లో రిపోర్టు చేయాలని సీపీ ఆదేశించారు.

వైద్య విద్యకు సర్వం సిద్ధం

(5వ పేజీ తరువాయి)

విద్యార్థుల ఎంపిక పూర్తి చేస్తారు. వచ్చే ఆగస్టు, సెప్టెంబరులో మొదటి సంవత్సరం తరగతులను నిర్వహించే వెసులుబాటు ఉంది.

కోర్సులు, సిబ్బంది..

నర్సంపేట వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు నిర్వహించనున్న సబ్జెక్టుల వివరాలు కింది విధంగా ఉన్నాయి. వైద్య విద్యార్థులకు మొదటి సంవత్సరంలో అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ సబ్జెక్టులతో బోధన జరుగనుంది. అలాగే నర్సంపేటకు మంజూరైన వైద్య కళాశాలలో 59 మంది అధ్యాపకులు(ప్రొఫెసర్లు) మరో 30మంది ఇతర సిబ్బంది విధులు నిర్వహించనున్నారు.. ఇందులో అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, పాథాలజీ, మైక్రో బయోలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీమెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్స్, ఈఎన్‌టీ, అనస్తీషియా, రేడియో డయోగ్నసిస్, ఆస్పత్రి అడ్మిన్ విభాగాల అధ్యాపకులు విధులు నిర్వహించనున్నారు. కాగా, నర్సంపేట వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌గా బానోతు కిషన్ను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నియమించింది. ఆయన బాధ్యతలను స్వీకరించారు.

వైద్య కళాశాలకు అనుమతిపై పెద్ది హర్షం

నర్సంపేటలో వైద్య కళాశాల ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 8 మెడికల్ కళాశాలలు మంజూరు చేయగా, అందులో 5 కాలేజీల ఏర్పాటుకు ఆమోదంరావడం.. అందులో నర్సంపేట వైద్య కళాశాల ఉండడం శుభ పరిణామమన్నారు. గత ప్రభుత్వం మెడికల్ కళాశాలకు శాశ్వత భవనాలు, ఇతర వసతుల కోసం రూ.193 కోట్లు మంజూరు చేసిందన్నారు. అయితే 100 ఎంబీబీఎస్ అడ్మిషన్లకు గత ప్రభుత్వం అనుమతి ఇవ్వగా, ప్రస్తుత ప్రభుత్వం 50 సీట్లకే అనుమతి ఇవ్వడం సరైంది కాదన్నారు. నర్సంపేటకు వైద్య కళాశాల మంజూరుకు అప్పటి సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు చొరవమరువలేనిదని అన్నారు.

ప్రైవేటు ఆస్పత్రులు నిబంధనలు పాటించాలి

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 7: రిజిస్ట్రేషన్ల కోసం దరఖాస్తులు చేసుకున్న ప్రైవేటు ఆస్పత్రులు ప్రభుత్వ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో పలు అంశాలపై సూచనలు చేశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటరమణ, ఐఎంఏ అధ్యక్షుడు అన్వర్, ఇతర వైద్యాధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాల దరఖాస్తుల గడువు పొడిగింపు

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 7: జిల్లాలోని 2023-24 విద్యా సంవత్సరం పోస్టు మెట్రిక్ ఉపకార వేతనాలకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ దివ్యాంగులు అర్హతను బట్టి రెన్యూవల్, ఫ్రెష్ విద్యార్థినీ, విద్యార్థులు తమ వివరాలను ఈ-పాస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి భాగ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గడువును మార్చి 31వ తేదీ వరకు పొడిగించినట్లు చెప్పారు. విద్యార్థుల నుంచి నమోదు చేయించే బాధ్యతను కళాశాలల ప్రధానాచార్యులు, యాజమాన్యాలు తీసుకోవాలన్నారు.

మహిళా అవార్డుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 7: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర స్థాయిలో అందించే మహిళా అవార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా జిల్లా సంక్షేమాధికారి ఎం.శారద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాంఘీక, ఆర్థిక సాధికారత రంగాల్లో అసాధారణ పరిస్థితుల్లో విశేష కృషి చేసిన మహిళలు రాష్ట్ర స్థాయిలో అవార్డులకు జిల్లా నుంచి ఆసక్తి, అర్హత కలిగిన వారు ఈ నెల 15 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు.[illegible] మెయిల్‌కు లేదా హైదరాబాద్‌లోని మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనర్‌కు హార్డు కాపీలను సమర్పించాలన్నారు. హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపం పక్కనున్న జిల్లా సంక్షేమాధికారి కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని ఆమె కోరారు.

రేపు పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన సదస్సు

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 7: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై ఈ నెల 9న ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టరేట్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి.ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ముఖ్యోద్దేశం సంప్రదాయ అసంఘటిత రంగంలో స్వహస్తాలతో తయారు చేసిన పరికరాలు లేదా ఉత్పత్తులు చేయువారు తమ తమ వృత్తులలో ఆధునిక ఉపకరణాలు, నైపుణ్యం, వృత్తి కళాకారులు, హస్త కళాకారులను మరింత అభివృద్ధి చేయడం కోసం అవగాహన పెంపొందించడానికి ఈ పథకం ఉపయోగపడుతుందని అన్నారు. సంబంధితశాఖల అధికారులు, బ్యాంకర్లు పాల్గొననున్న ఈ సదస్సులో కుమ్మరులు, విశ్వబ్రాహ్మణులు, స్వర్ణకారులు, శిల్పులు, కమ్మరులు తదితర వృత్తులలో నిమగ్నమై ఉన్న సంప్రదాయ చేతివృత్తుల వారు, హస్త కళాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

మహిళా కాంగ్రెస్ గ్రామ కమిటీ నియామకం

దుగ్గొండి, ఫిబ్రవరి 7 : మండలంలోని తిమ్మంపేటలో మహిళా కాంగ్రెస్ గ్రామ కమిటీని మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు వెండి సక్కుబాయి, గ్రామ అధ్యక్షుడు గిన్నె నర్సింహా స్వామి ఆధ్యర్యంలో బుధవారం కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షురాలుగా మండల వనమాల, ఉపాధ్యక్షురాలుగా దండు అనిత, బొంత పూజిత, కార్యదర్శిగా సౌడారపు మంజుల, సహాయ కార్యదర్శిగా మామునూరి రజిత, కోశాధికారిగా మేక రాధిక, సభ్యులుగా కొనగండ్ల శైలజ, దండు స్వప్న, జెటబోయిన సుజాత, దొనపాటి రజిత, కుసుమ అనసూర్య, పోదిల భాగ్యలక్ష్మిలు ఎంపికయ్యారు. ఈకార్యక్రమంలో అక్కపెల్లి రమదేవి, పెండ్యాల సాంబయ్య, ఆగయ్య, పొదిలసాంబయ్య రవి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బురహాన్‌పల్లిలో కిడ్నాపర్లంటూ ప్రచారం

రాయపర్తి, ఫిబ్రవరి 7 : సోషల్ మీడియా వేదికగా కిడ్నాపర్ల హల్‌చల్ అంటూ పలు కథనాలు వైరలైన సంఘటన మండలంలోని బురాహన్‌పల్లిలో బుధవారం చోటు చేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తులు స్థానిక ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలోకి చొరబడ్డారని, విద్యార్థులను కిడ్నాప్‌చేసేందుకు యత్నించారంటూ పలువురు పోస్టులు పెట్టడంతో స్థానికులు గందరగోళానికి గురయ్యారు.రాయపర్తి ఇన్‌చార్జి ఎస్సై ప్రవీణ్ కుమార్‌ను వివరణ కోరగా..కిడ్నాపర్లని వచ్చిన ప్రచారంలో నిజంలేదని, తల్లిదండ్రులు భయాందోళనకు గురికావద్దన్నారు. పోలీసులు అందుబా టులో ఉంటారని, ఎప్పటికప్పుడు పెట్రోలింగ్ వాహనం గస్తీ కాస్తుందని స్పష్టం చేశారు.

'గృహజ్యోతి' అమలుకు విద్యుత్ అధికారుల శ్రీకారం



తిమ్మంపేటలో దండోరా వేస్తున్న సాంబయ్య

దుగ్గొండి, ఫిబ్రవరి 7: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారెంటీ పథకాలలో భాగంగా గృహజ్యోతి పథకం అమలుకు విద్యుత్ అధికారులు గ్రామాల్లో ప్రచారంతో పాటు బిల్లు ఆన్‌లైన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ప్రతీ గృహంలో ప్రతీ అర్హుడికి గృహజ్యోతి పథకంలో 200 విద్యుత్ యూనిట్ల బిల్లు మాఫీ చేసే విధంగా సిబ్బంది కార్యాచరణ చేపట్టారు. గ్రామా ల్లో పథకం అమలుకు రేషన్ కార్డు నంబరు, ఆధార్ కార్డు నంబర్లను ఇళ్ల నందు ఆన్‌లైన్ బిల్లు కొట్టే వారికి చూపాలని గ్రామాల్లో సిబ్బందితో దండోరాతో గ్రామస్తులను చైతన్య పరుస్తున్నారు. గ్రామాల్లో విద్యుత్ సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ విద్యుత్ మీటర్ రీడింగ్ నమోదుతోపాటు కుటుంబ రేషన్ కార్డు, ఆధార్ కార్డుల నంబర్లను ఆన్‌లైన్ చేస్తున్నారు. మండలస్థాయి అధికారులు సబ్బందితో సమావేశం నిర్వహించి గృహజ్యోతి పథకం అమలు పట్ల అవగాహన కల్పిస్తున్నారు. ఫిబ్రవరి నెల విద్యుత్ బిల్లు మాఫీ చేసే దిశగా అధికారుల బృందం కృషి చేస్తున్నట్లు విద్యుత్ అధికారులు తెలుపుతున్నారు.

సేవాలాల్ జయంతిని విజయవంతం చేయాలి

చెన్నారావుపేట, ఫిబ్రవరి 7 : సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని సేవాలాల్ ఉత్సవ కమిటీ చైర్మన్ భూక్య గోపాల్‌నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేఖరులతో ఆయన మాట్లాడుతూ గిరిజనుల ఆరాధ్యదైవమైనా సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొనాలన్నారు. లంబాడ యువత, రాజకీయ నాయకులు, ఉద్యోగులు మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. జయంతి ఉత్సవాలను నర్సంపేట పట్టణంలోని మాదన్నపేట రోడ్డులో ఉన్న సేవాలాల్ పంత్ దేవాలయం వద్ద అధికారికంగా నిర్వహించటం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో ఉత్సవాలను మరింత వైభవంగా కొనసాగిస్తామన్నారు. సేవాలాల్ జయంతి ఫిబ్రవరి 15ను ప్రభుత్వం సెలవుగా ప్రకటించాలన్నారు. ప్రధాన కార్యదర్శి అజ్మీరా శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్లపై జాగ్రత్తలు తీసుకోవాలి

చెన్నారావుపేట, ఫిబ్రవరి 7: ప్రస్తుతం దశలో పంటలకు సోకే తెగుళ్లపై రైతులు వ్యవసాయశాఖ అధికారుల సూచనలను, జాగ్రత్తలను పాటించాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఉషాదయాల్ అన్నారు. బుధవారం మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న, వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరిలో కాండం తొలిచే పురుగు నివారణకు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు మొదటి దశలో రైతులు తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే కలుపు మొక్కలను తొలిగించే పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎఫ్ఎస్ఎం ఉమ్మడి జిల్లా అధికారి వినయ్, ఏఈవో శశికాంత్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడికి సన్మానం

రాయపర్తి, ఫిబ్రవరి 7 : ఇటీవల నూతనంగా రాయపర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియామకమైన ఈదులకంటి రవీందర్‌రెడ్డిని బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఈరెడ్డి నర్సింహారెడ్డి, యూత్ అధ్యక్షుడు పట్నం సురేష్, పూస సతీష్ కుమార్, లింగాల వెంకటయ్య, వేల్పుల రాంబాబు, అఖిల్, అనిల్, నాగపూరి విజయ్ కుమార్, అంకుషవలీ, యాకూబ్, ప్రశాంత్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అండగా నిలిచిన బాల్య మిత్రులు



ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

రాయపర్తి, ఫిబ్రవరి 7: మండల కేంద్రానికి చెందిన మచ్చ అశోక్ ఆరోగ్యం బాగా లేకపోవడంతో చిన్ననాటి స్నేహితులు ఆ కుటుంబానికి అండగా నిలిచారు. బుధవారం పదో తరగతిలో కలిసి చదువుకున్న మిత్రులు కలిసి రూ.24 వేలు ఆర్థికసాయంచేశారు. పక్షవా తానికి గురైన అశోక్ చాలా కాలంగా నిస్సహాయస్థితిలో ఉన్నాడు. దీంతో పదో తరగతి లో కలిసి చదువుకున్న వారంతా కలిసి అండగా నిలిచారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

రాయపర్తి, ఫిబ్రవరి 7 : మండల కేంద్రంలోని మహాత్మ హై స్కూల్‌లో బుధవారం ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి అందరినీ ఆకట్టుకున్నారు. ఎంఈవోగా లాస్య, హెచ్‌ఎంగా లక్ష్మీప్రసన్న, డీఈవోగా సిద్దార్థ, ఉపాధ్యాయులుగా సిరివల్లిక, శివాని, సాత్విక, శ్రావ్య, అపరంజి, మనికంట రాజ్, గోపిచంద్, రాజేష్‌లు వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ వెంకటరెడ్డి, సోమన్న, సంతోష్, రవణ,ప్రిన్సిపాల్ శిబుపాల్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ చేపట్టాలి

నల్లబెల్లి, ఫిబ్రవరి 7 : యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్సీ హాస్టల్లోని పదో తరగ తి బాలికల ఆత్మహత్యలపై సిట్టింగ్ జడ్జి చేత సమగ్ర విచారణ చేపట్టి న్యాయం చే యాలని సీఎం రేవంత్‌రెడ్డికి నల్లబెల్లి నుంచి ఉత్తరాన్ని దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి భట్టు సాంబయ్య బుధవారం పంపించారు. ఈ సందర్భంగా భట్టు సాంబయ్య మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు కోడి భవ్యశ్రీ, గాదె వైష్ణవిలు ఇటీవల ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచా రణ చేపట్టి, విద్యార్థుల ఆత్మహత్యలకు కారకులైన వ్యక్తుల కు చట్టపరమైన శిక్షను విధించాలన్నారు. అనంతరం విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.10 లక్షలను అందజేసి, కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు.

10 నుంచి సమత దీక్ష, నగర సంకీర్తనలు

నర్సంపేట, ఫిబ్రవరి 7: వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి 28వ తేది వరకు సమత దీక్ష, నగర సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వికాస తరంగిణి బాధ్యులు ఎంవీ కృష్ణారావు, దాస్యం రంగనాథ స్వామి తెలిపారు. పట్ట ణంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం తరంగిని సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వేంశెటి శ్రీనివాస్, చల్లా వెంకటరెడ్డి, యతిపతి, శ్రీధర్, శేఖర్, రేణుక, శిరీష, శ్రీలక్ష్మి, రమ, కల్పన, శైలజ పాల్గొన్నారు.